ప్రజా కలం

Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
సంప్రదించండి
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
9010972526

బుధవారం | 16-09- 2026 | సంపుటి: 17, సంచిక: 165, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

భూభారతి పేరుతో

భూ హారతి

సీఎం రేవంత్ రెడ్డి తీసుకువచ్చే ప్రతి స్కీమ్ వెనక ఓ పెద్ద స్కాం



22ఏ అవకతవకలపై జ్యూడీషియల్ ఎంక్వైరీ జరగాలి

అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించడానికి మూడేళ్లు ఎందుకు పట్టింది?

మూడేళ్లపాటు సెటిల్‌మెంట్లు చేసుకొని ఇప్పుడు రెగ్యులరైజ్ చేసుకుంటురు

30 శాతం కమీషన్ల కోసం చిల్లర ప్రయత్నాలు మానుకోవాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఢిల్లీ, సెప్టెంబర్ 15: సీఎం రేవంత్ రెడ్డి తీసుకువచ్చే ప్రతి స్కీమ్ వెనక ఓ పెద్ద స్కాం ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. భూభారతి పేరుతో భూ హారతి చేస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వంపై మండపడ్డారు. 22ఏ అవకతవకలపై జ్యూడీషియల్ ఎంక్వైరీ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించడానికి మూడేళ్లు ఎందుకు పట్టిందని రేవంత్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. మూడేళ్లపాటు సెటిల్‌మెంట్లు చేసుకొని ఇప్పుడు రెగ్యులరైజ్ చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 30 శాతం కమీషన్ల కోసం చిల్లర ప్రయత్నాలు మానుకోవాలి. బేషరతుగా క్షమాపణ చెప్పి కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను జాబితా నుంచి తొలగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ధరణి రక్షణ కవచం.. ఇప్పుడు 'భూభారతి కాదు.. భూ హారతి' అసైన్డ్ భూములపై ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీలకు యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. అన్ని అక్రమాలు వెలుగులోకి తెస్తాం. 22ఏ కింద లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారని, 30 శాతం కమిషన్ల కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 22ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని ఆశించామని, అయితే రెవెన్యూ మంత్రి కేవలం 'సారీ'తో సరిపెట్టారని కేటీఆర్ అన్నారు. 'తప్పు చేసింది అధికారులు కాదు.. ప్రభుత్వమే. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదు' అని అన్నారు.

తరువాయి 2వ పేజీలో...



ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్‌తో

సీఎం రేవంత్ భేటీ

మూసీపై కీలక చర్చలు



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజాకలం) :

అగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్-Vతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. 'మా వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో అగా ఖాన్ ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. అగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో ఇటీవలే మా శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకున్నాం. అగా ఖాన్ ఫౌండేషన్ కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించింది' అని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న నిటీ కాలేజ్, ఉస్మానియా

తరువాయి 2వ పేజీలో...



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత


దమనకాండ నడుస్తోంది

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజాకలం): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత దమనకాండ నడుస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రజాకార్ల పాలనలో ప్రజలు వడ్డ ఇబ్బందులు, రక్తపు గుర్తులు కనిపిస్తాయని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో విముక్తి కలిగిందని చెప్పుకొచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో కిషన్‌రెడ్డి మాట్లాడారు. నిజాం మెడలు వంచడంతో 1948 సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ గడ్డకు ముక్తి లభించిందని వెల్లడించారు.

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



చెన్నూర్ ను ఆధునిక పట్టణంగా

తీర్చిదిద్దడమే లక్ష్యం

- 2027 గోదావరి పుష్కరాలకు చెన్నూర్ లో 70 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి

చెన్నూర్ ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని, 2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ లో పుష్కర ఘాట్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, నీటిపారుదల శాఖ అధికారి విష్ణు, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు 2027 కొరకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ఇందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు

తరువాయి 2వ పేజీలో...

హైదరాబాద్ రవాణా వ్యవస్థ విస్తరణకు

సమగ్ర ప్రణాళిక

నగరానికి నలువైపులా బస్ టెర్మినల్స్ ఏర్పాటు దిశగా చర్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజాకలం) :

నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తోందని

తరువాయి 2వ పేజీలో...

- గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్‌పై ప్రతిపాదనలు
- అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర శివార్లలోని టెర్మినల్స్‌కే పరిమితం చేసేలా కార్యాచరణ
- లాస్ట్ మైల్ కనెక్టివిటీ ద్వారా మెట్రో, ఎంఎంటీఎస్, సిటీ బస్సులతో ప్రయాణికులకు అనుసంధానం.
- నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్.

అసైన్డ్ భూములపై రేవంత్ ప్రభుత్వం వెంటనే

శ్వేతపత్రం విడుదల చేయాలి

- మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

ఢిల్లీ, సెప్టెంబర్ 15 : తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో 22ఏపై చర్చ జరుగుతుందని ప్రజలు భావించారని.. కానీ అలా ఎందుకు జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



తరువాయి 2వ పేజీలో...



మాట తప్పడం, మడమ తిప్పడమే

సీఎం ట్రేడ్ మార్క్

ప్రభుత్వ ఉద్యోగులంటే మీ బానిసలు కాదు

సెప్టెంబర్18వ తేదీలోగా వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సీఎం రేవంత్ రెడ్డిపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజాకలం) :

ప్రభుత్వ ఉద్యోగులంటే మీ బానిసలు కాదని గుర్తు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సెప్టెంబర్18వ తేదీలోగా వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆమె అల్టిమేటం ఇచ్చారు. సీఎం స్పందించకుంటే హైదరాబాద్ దిగ్బంధానికి సిద్ధం కావాలని ఉద్యోగ సంఘాలకు ఆమె పిలుపునిచ్చారు. మీ పోరాటానికి టీఆర్ఎస్ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై టీఆర్ఎస్ ఏర్పాటు చేసిన సదస్సులో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. మాట తప్పడం, మడమ తిప్పడమే సీఎం రేవంత్ రెడ్డి బ్రేడ్ మార్క్ అని ఎద్దేవా చేశారు. తమ సమస్యలు తీర్చాలని అడిగితే ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదిరిస్తున్నరంటూ సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఉపాధ్యాయులంతా కూడా ఉద్యోగం కన్నా ఉద్యమమే ముఖ్యమని పోరాటం చేశారని గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి సర్కార్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైన ప్రజలకు మెరుగైన పారదర్శకమైన పాలన అందించాలంటే ఉద్యోగుల సహకారం అవసరమని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ప్రభుత్వ ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ వారిని నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేరుతో గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ఒక్క పథకం కూడా సరిగా అమలు కావటం లేదని తెలిపారు. ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తుండటం కారణంగానే పరిపాలన


తరువాయి 2వ పేజీలో...

ఏఐ భయాందోళనలన్నీ

అబద్ధం

- డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్: కృత్రిమ మేధపై ఇటీవల భయాందోళనలు వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. ఏఐతో మానవాళి అంతం అవుతుందని కొందరు నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు.



తరువాయి 2వ పేజీలో...

భూభారతి పేరుతో భూ హారతి

మొదటి పేజీ తరువాయి...

ప్రజలు తమ కష్టార్జితంతో కొనుగోలు చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లయితే వాటిని బేషరతుగా తొలగించి, బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ధరణి రక్షణ కవచం..ధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ పేర్కొన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం సాధ్యం కాని విధంగా భద్రత ఉండేదన్నారు. ప్రస్తుతం యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆరోపించారు. 'ఇది భూభారతి కాదు.. భూ హారతి' అని వ్యాఖ్యానించారు. అన్ని అడ్డగోలు చర్యలను నిలిపివేసి, ప్రజల యాజమాన్య హక్కులను రక్షణ కల్పించేలా యథాతథ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు.

అసైన్డ్ భూములపై హామీ నిలబెట్టుకోవాలి..

అసైన్డ్ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి, వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని అన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకం వెనుక అక్రమాలు ఉన్నాయన్న తమ ఆరోపణలు భవిష్యత్తులో వెలుగులోకి వస్తాయని అన్నారు. 'రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. తప్పు చేసిన వారిని వదిలిపెట్టం' అని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపారుప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకుందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అనని మాటలను అంటగట్టి, సభ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే తమను సస్పెండ్ చేసిందన్నారు. 'సస్పెండ్ చేసినప్పటికీ మేము ప్రజల్లోనే ఉన్నాం. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూనే ఉంటాం. 22ఏ అంశమైనా, ప్రజల భూముల సమస్యలైనా ప్రజల మధ్యకు తీసుకెళ్తాం' అని కేటీఆర్ అన్నారు.

22ఏ పై న్యాయ విచారణకు స్వాగతం..

22ఏ వ్యవహారంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిగితే అందరికీ మంచిదేనని కేటీఆర్ అన్నారు. 'తప్పు చేసింది ప్రభుత్వం.. శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు' అని వ్యాఖ్యానించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడం ద్వారా ప్రజల యాజమాన్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇవాళ తప్పించుకున్నా రేపు తప్పించుకోలేరని హెచ్చరించారు. పోలీసులపై నమ్మకం లేదు.. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా పనిచేస్తున్నారని విమర్శించారు. 'పోలీసులను నమ్ముకుంటే న్యాయం దొరకదనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నాం. న్యాయస్థానంలో తప్పకుండా న్యాయం దొరుకుతుందని ఆశిస్తున్నాం' అని కేటీఆర్ అన్నారు. కామన్ సివిల్ కోడ్‌పై ఇప్పుడే నిర్ణయం చెప్పాల్సిన అవసరం లేదని, అలాంటి ప్రతిపాదన వచ్చినప్పుడు పార్టీ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ తెలిపారు.

చెన్నూర్ ను ఆధునిక పట్టణంగా

తీర్చిదిద్దడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

కలుగకుండా చెన్నూర్ లో పుష్కరాలు, మౌలిక వసతుల అభివృద్ధి కొరకు 70 కోట్ల రూపాయలతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సుమారు 8 కోట్ల రూపాయలతో పుష్కర ఘాట్లు, స్నానపు గదులు, రహదారులు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, పుష్కరాలకు దాదాపు 1 లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా రోడ్లు, త్రాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, పార్కింగ్ తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గోదావరి రోడ్డుతో పాటు చెన్నూర్ పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, అంబేద్కర్ విగ్రహం నుంచి చెన్నూర్ వరకు సుమారు 5 కోట్ల 50 లక్షల రూపాయలతో రోడ్డు విస్తరణ, లైటింగ్ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, పేదలు, చిరు వ్యాపారులకు ప్రయోజనం కలిగేలా 1 కోటి 20 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద సుమారు 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి ఇంటికి నల్లా ద్వారా త్రాగునీరు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చెన్నూర్ పెద్ద చెరువును సుమారు 17 కోట్ల రూపాయలతో చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, శివ్వారం గోదావరి మొసళ్ల మడుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని, కాళేశ్వరం, ధర్మపురి, బాసర, భద్రాచలం, కోటిలింగాల, చెన్నూర్ లోని అంబ అగస్తేశ్వర ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పుష్కరాల నాటికి ఆలయాలు, పుష్కర ఘాట్లు, రోడ్లు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. చెన్నూర్ లో నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని ఈ నెలలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అనంతరం పుష్కర ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో భూమిపూజ నిర్వహించారు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు బొక్కలగూడెంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పేద గౌడ కులస్తులలో ఇందిరమ్మ ఇళ్లు లేని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఇళ్ల సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సన్న బియ్యం పంపిణీ తదితర అంశాలపై మంత్రి సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, షేర్ ద విజన్ సంస్థ సభ్యుల తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చేన్నూర్ మండలం సోమనపల్లిలో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు అందుబాటులోకి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చెన్నూర్ లో డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఈ సంవత్సరం విద్యార్థుల నమోదు పెరిగిందని తెలిపారు. సోమనపల్లిలో సుమారు 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 100 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఆర్.ఓ. ప్లాంట్ల ఏర్పాటు, నాణ్యమైన ఆహారం, యూనిఫాంలు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సొంత భవనాలు లేని పాఠశాలలకు సొంత భవనాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో లెర్నింగ్ అవుట్‌కమ్స్ మెరుగ్గా ఉన్నాయని, ఇదే స్థాయిని కొనసాగించేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్‌తో సీఎం రేవంత్ భేటీ

మొదటి పేజీ తరువాయి...

ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో అగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని సీఎం అన్నారు. ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. మూసీ నదిని నైట్ ఎకానమీ కోసం తీర్చిదిద్దుతామని వెల్లడించారు. తప్పకుండా గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 100కు పైగా దేశాల ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరవుతారన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని.. నెట్–జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ ఉండబోతుందని అన్నారు. ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాల దూరంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. సింగపూర్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ లాంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత దమనకాండ నడుస్తోంది

మొదటి పేజీ తరువాయి...

విమోచన చరిత్రను గత పాలకులు తొక్కిపెట్టారని విమర్శించారు.

ఈ రెండు పార్టీలు
ప్రజలకు ద్రోహం చేస్తున్నాయి..

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విమోచన వేడుకలు జరవడానికి ఎందుకు భయపడుతున్నాయని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఏంఐఎం మోచేతి నీళ్లు తాగి ఈ రెండు పార్టీలు ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 90వ దశకంలో హైదరాబాద్ ముక్తి దివస్ చేయాలని అనేక పోరాటాలు చేశామని ప్రస్తావించారు. గత ఐదేళ్ల నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాల సారథ్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇది రాజకీయ పరమైన అంశం కాదని .. యావత్తు తెలంగాణ నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. భారత మాజీ ఉపరాష్ట్రపతితో పాటు పలువురు కేంద్ర మంత్రులు తాము నిర్వహించే విమోచన వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన నిర్వహించే విమోచన వేడుకలకు హైదరాబాద్, తెలంగాణ ప్రజలు స్వచ్ఛందంగా రావాలని కోరారు.

అందుకోసమే విమోచన
దినోత్సవం నిర్వహిస్తున్నాం..

సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది విలీనం, విద్రోహం అనేవాళ్లకు తాము తెలంగాణ స్వాతంత్ర్యం అంటామంటామని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం ప్రభుత్వాల విధి అని తెలిపారు. అందుకోసమే విమోచన దినోత్సవం పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ మీద.. సీఎం రేవంత్‌రెడ్డి చేసే విమర్శలపై సమయం వచ్చినపుడు స్పందిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

అసైన్డ్ భూములపై రేవంత్ ప్రభుత్వం వెంటనే

శ్వేతపత్రం విడుదల చేయాలి

మొదటి పేజీ తరువాయి...

మంగళవారం ఢిల్లీలో మీడియాతో రఘునందన్ రావు మాట్లాడారు. గుడులు, బడులు, దేవస్థానాల భూములు, ప్రభుత్వ భూములు రిజిస్టర్ చేయొద్దని 22 ఏ చట్టం తీసుకువచ్చారని ప్రస్తావించారు. 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రిపేర్ కాకుండా అసెంబ్లీకి వచ్చారని విమర్శించారు. 22ఏ గురించి ఎవరు మాట్లాడినా అందరినీ ఒకే గాడిన కట్టడం సరికాదని అన్నారు. తన పార్లమెంట్ పరిధిలోని సింఫనీ హోంలో రిజిస్ట్రేషన్ల సమస్య ఉండటంతో మాట్లాడానని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోయారనీ ఎలా మాట్లాడారని నిలదీశారు. 22ఏలో ఉన్నా 47440 ఎకరాలు ఎక్కడ, ఏ ఊరిలో తొలగించారో మంత్రి పొంగులేటి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 22 ఏ లో చేర్చిన భూమి తొలగించామంటున్న కాంగ్రెస్ 22 ఏ లో చేర్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. 22 ఏ లో కోటి ఎకరాలకు పైగా భూమి ఉందని.. ఇంత భూమి ఎలా చేర్చారు.. ఎలా తొలగిస్తారో పొంగులేటి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. పేదలకు అన్యాయం చేసిన అధికారులపై, కలెక్టర్లపై చర్యలు తీసుకున్నారా లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 22 ఏ లో ఉన్న కోటి రెండులక్షల ఎకరాల భూమి ఎప్పటి వరకు తొలగిస్తారో చెప్పాలని పట్టుబట్టారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కమిటి వేసి 22 ఏ భూముల సమస్యను పరిష్కరించాలని కోరారు. భూ భారతి వచ్చిన తర్వాత కూడా తప్పు జరిగిందని పొంగులేటి ఒప్పుకున్నారని అన్నారు. పేద ప్రజలకు అన్యాయం చేసి తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. ధరణి, భూ భారతి తెచ్చిన రెండు పార్టీలపై ప్రజలకు నమ్మకం లేదని విమర్శించారు. అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు.

ఏఐ భయాందోళనలన్నీ అబద్ధం

మొదటి పేజీ తరువాయి...

ఏఐ భద్రత గురించి వస్తున్న భయాలు అన్నీ అబద్ధం అని అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ అంశంలో జాగ్రత్తలు తీసుకోవాలని వస్తున్న అభిప్రాయాలను ఆయన విమర్శించారు. ఏఐ పరిశ్రమలో జరుగుతున్న టెక్నాలజీ పరీక్షలను చెక్ చేసేందుకు థార్డ్ పార్టీ అవసరమని ఆంత్రోపిక్ సహ వ్యవస్థాపకుడు జాక్ క్లార్క్ వ్యాఖ్యలు చేయడంతో ట్రంప్ కూడా ఆ అంశంపై స్పందించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలకు చెందిన పలువురు నిపుణులు కూడా కొన్ని రోజులగా ఏఐపై భయాందోళనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ అనుమానాల వల్ల ఏఐ కంపెనీల షేర్లు పడిపోయాయి. సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ స్పందిస్తూ.. ఏఐపై గ్లోబల్ వార్నింగ్ స్కామ్ ఉత్తదే అని, ర్యాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్లు ఆ వదంతులు వ్యాపింప చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ నకిలీ వార్తల గుట్టును తాను విప్పుతున్నట్లు చెప్పారు. ఇది రష్యా నకిలీ బెదిరింపులు అని కూడా ఆయన అన్నారు. ఏఐ రక్షణ కోసం కావాల్సింది బలమైన, స్మార్ట్ అధ్యక్షుడు అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ఏఐ, డేటా సెంటర్లకు వ్యతిరేకంగా ఓ కుట్ర సాగుతోందని, ఈ అంశంలో కేవలం ఒక్క చైనా మాత్రమే సంతోషంగా ఉందని, ఏఐలో ఎవరు విజయం సాధిస్తే, వాళ్లే గెలిచినట్లు అవుతుందని ట్రంప్ అన్నారు.

ఏఐ రంగంలో చైనా సాధిస్తున్న అభివృద్ధి పట్ల అమెరికా ఆందోళన చెందుతోందని, ఆ దేశం తన విధానాలను కూడా మార్చుకుంటోందని చైనీస్ మీడియాలో ఇటీవల నిపుణులు పేర్కొన్నారు. ఏఐ పరిశ్రమలో చైనా నుంచి గట్టి పోటీ వస్తున్న విషయాన్ని అమెరికా గ్రహించిందని, ఒకవేళ అమెరికా ఆ రంగంలో మందగిస్తే, అప్పుడు ఏఐ వేగాన్ని చైనా అందుకుంటుందని ఫుడాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జిన్ క్వియాంగ్ పేర్కొన్నారు.

హైదరాబాద్ రవాణా వ్యవస్థ విస్తరణకు సమగ్ర ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి...

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి నలువైపులా ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి హైదరాబాద్‌లోకి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగరంలోని అంతర్గత ప్రాంతాల్లోకి రాకుండా ఆయా దిశల్లో ఏర్పాటు చేసే టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విమానాశ్రయం వైపు వెళ్లే బస్సులు, హైదరాబాద్‌కు వచ్చే అంతర్‌జిల్లా బస్సులు కూడా అవసరాన్ని బట్టి నిర్దేశిత టెర్మినల్స్ వద్దే నిలిపి, అక్కడి నుంచి ప్రయాణికులను నగరంలోని వివిధ ప్రాంతాలకు తరలించే విధంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దీంతో నగరంలోకి వచ్చే ప్రయాణికులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, రాత్రి సమయాల్లో రోడ్లపైకి పెద్ద సంఖ్యలో రావడం వల్ల ట్రాఫిక్ రద్దీతో పాటు కాలుష్యం కూడా పెరుగుతోందని మంత్రి తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవేట్ బస్సులను కూడా నిర్దేశిత బస్ టెర్మినల్స్ ద్వారా నిర్వహించే విధానంపై ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. అవసరమైన నిబంధనల మేరకు యూజర్ ఛార్జీలు వసూలు చేస్తూ టెర్మినల్స్‌ను వినియోగించుకునే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేట్ బస్సులు, ఆర్టీసీ దూరప్రాంత బస్సులు నగరంలోని రద్దీ ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధానం అమలులోకి వస్తే నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు అవసరమైన భూమి విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

మాట తప్పడం, మడమ తిప్పడమే సీఎం ట్రేడ్ మార్క్

మొదటి పేజీ తరువాయి...

నజావుగా సాగటం లేదని టీఆర్ఎస్ చీఫ్ వివరించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులను అభివృద్ధిలో డెవలపర్స్‌గా చూస్తామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను సంతోష పెట్టేలా, వారిని గౌరవించేలా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణ జాగృతి గత 20 ఏళ్లుగా ఏ కార్యక్రమం చేసిన సరే దాన్ని ముందుండి నడిపించే ప్రభుత్వ ఉపాధ్యాయులేనని తాను గర్వంగా చెబుతానని పేర్కొన్నారు. 2023 ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని చేస్తామని మాటిచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారిని పట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉద్యోగి సంతోషంగా లేరన్నారు. రాష్ట్రంలో 5 లక్షలకు పైగా మాత్రమే పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే.. మరో 5 లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని వివరించారు. రిటైర్ అయిన ఉద్యోగులు 2 లక్షల వరకు ఉన్నారని గణాంకాలతో సహా కల్వకుంట్ల కవిత తెలిపారు. వారందరికీ భరోసా ఇచ్చేందుకే ఈ మీటింగ్ పెట్టుకున్నామని ఆమె చెప్పారు. తెలంగాణలో ప్రతి ఒక్కరికీ ఉచితంగా విద్య, వైద్యం అందాలనే ఉన్నత లక్ష్యాన్ని టీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని కవిత స్పష్టం చేశారు. కానీ ఈ కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మన రాష్ట్రంలో దాదాపు 6 వందల మండలాలుంటే 8 మంది మాత్రమే పర్మినెంట్ ఎంఈఓలు ఉన్నారని గుర్తు చేశారు. దీంతో ప్రభుత్వ విద్యపై మానిటరింగ్ అనేదే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. హెడ్ మాస్టర్లను, సీనియార్ టీచర్లనే ఎంఈఓలుగా పెడుతున్నారంటూ రేవంత్ ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. విద్యార్థులకు పేషియల్ రికగ్నేషన్ అంటూ రిపోర్ట్‌లు అంటూ టీచర్లు పాఠాలు చెప్పకుండా చేస్తున్నారని చెప్పారు. ఇక ఒకే టీచర్ ఉన్న స్కూళ్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. టీచర్లకు సీనియారిటీని బట్టి ఇవ్వాల్సిన ప్రమోషన్లు కూడా ఇవ్వటం లేదన్నారు. గురుకులాలు, డిగ్రీ కాలేజ్‌లలో 40 శాతం ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఖాళీలను భర్తీ చేయటం లేదని.. ఉన్న టీచర్లను ఈ ప్రభుత్వం సరిగా చూసుకోవటం లేదని పెదవి విరిచారు. ప్రధాని మోదీ కారణంగా పప్పు, ఉప్పు, చక్కెర ధరలు భారీగా పెరిగాయని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు డీఏ ఇవ్వాల్సి ఉంటుందని ప్రభుత్వానికి సూచించారు. కానీ గత 32 నెలలుగా డీఏ ఇవ్వకుండా వారి కరువు భత్యాన్ని ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మింగేశారని కవిత ఎద్దేవా చేశారు. ఇవే సమస్యలపై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇదే రేవంత్ రెడ్డి గతంలో ఇష్టమొచ్చినట్లు తిట్టారని గుర్తు చేశారు. కానీ ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమీ చేయటం లేదని అన్నారు. రాష్ట్రంలో లక్షా 20 వేల మంది టీచర్లే ఉంటారు. కానీ వాళ్లతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాలేదని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. ప్రతి ఊళ్లో ఓ స్కూల్ ఉండాలని.. ప్రతి తరగతికి ఓ టీచర్ ఉండాలని టీఆర్ఎస్ ఒక విధానం పెట్టుకుందని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యను పరిపుష్టం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడుతామని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భరోసా ఇచ్చారు. ఈ రాష్ట్రంలో పోలీసుల పరిస్థితి కూడా ఘోరంగా ఉంది. వాళ్లకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు పెండింగ్‌లోనే ఉన్నాయని చెప్పుకొచ్చారు. 2003లో రిక్రూట్ అయిన పోలీసులకు ఓపీఎస్ రాలేదని గుర్తు చేశారు. అదే విధంగా 2003లో రిక్రూట్ అయినా టీచర్లకు కూడా ఓపీఎస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. 2003లో రిక్రూట్ అయిన టీచర్లకు ఓపీఎస్ ఇస్తే ప్రభుత్వానికే రూ. 2 వేల కోట్లు మిగులుతాయని తెలిపారు. కనీసం ఈ విషయం కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియటం లేదని ఎద్దేవా చేశారు. వారిని ఓపీఎస్‌కు బదలాయించడం ద్వారా వచ్చే రూ.2 వేల కోట్లతో మిగతా బకాయిలు తీర్చాల్సి ఉందని ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సూచించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేసే విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు మాటిమాటికి ఆందోళనలను వాయిదా వేసుకుంటున్నారని చెప్పారు. మనం తల్లి కాంగ్రెస్‌తో పోరాటం చేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్న వాళ్లమని.. ఈ పిల్ల కాంగ్రెస్‌కు భయపడాల్సిన అవసరం లేదని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సూచించారు. మనం ఏపీని చూసి ఉద్యమాలు నేర్చుకోలేదన్నారు. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వంపై టీచర్లు పెద్ద ఎత్తున పోరాటం చేసి వాళ్ల డిమాండ్లు సాధించుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మనం కూడా అదే విధంగా పోరాటం చేసి డీఏలు సాధించుకోవాలని వారికి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై పోరాటం చేసే విషయంలో భయపడుతుండటంతో కిందిస్థాయి ఉద్యోగులకు మీపై నమ్మకం ఉండటం లేదంటూ ఉద్యోగ సంఘం నేతలకు కవిత చురకలంటించారు. దాదాపు 206 ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు జేఏసీ పోరాటం చేస్తున్నాయని వివరించారు. అందుకే తాము వారికి మద్దతుగా సంయమనంగా ఉన్నామని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మితే మీరు అన్యాయం కావాల్సిందేనని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కవిత హితవు పలికారు. ఉద్యోగుల పీఆర్సీ ఎక్స్‌పైర్ అయ్యే పరిస్థితి ఉందని ఆందోళన చెందారు. తక్షణమే వారికి 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డు ఎక్కడైనా ప్రైవేట్ హాస్పిటల్‌లో పని చేస్తుందా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కవిత ఓపెన్ ఛాలెంజ్ చేశారు. ప్రభుత్వ హెల్త్ కార్డు పనిచేస్తే మీరు ఏం చేయమంటే అది టీఆర్ఎస్ చేస్తుందన్నారు. లేదంటే ముఖ్యమంత్రి రాజీనామా చేస్తారా? అని సవాల్ విసిరారు. ఉద్యోగులు తమ బెన్‌ఫిట్స్ అడిగితే రెండేళ్లు ఆగాలంటూ ముఖ్యమంత్రి బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా రెండేళ్లు ఆగితే మీరు పదవిలో ఉండరన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ ఏమీ చేయరని అనుకుంటున్నారేమో.. వారికిచ్చే బెన్‌ఫిట్స్ ఆలస్యం చేస్తే 6 నుంచి 12 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని రేవంత్ ప్రభుత్వానికి సూచించారు. ఇప్పటి వరకు ఉద్యోగులు ఇబ్బందులకు గురి కావద్దని చూస్తున్నామని తెలిపారు. వారు చేసే ఏ ఆందోళనకైనా తాము నైతికంగా మద్దతిస్తామన్నారు. ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్న 37 అంశాల్లో చాలా వరకు డబ్బులకు సంబంధం లేనివే ఉన్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా 317 జీవో బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో వారికి న్యాయం చేసేందుకు తాను చేసిన ప్రయత్నం ఫలించలేదని ఆవేదన చెందారు. 317 బాధితుల్లో మహిళ ఉద్యోగులే అధికంగా ఉన్నారని చెప్పారు. వాళ్లు బాధపడుతుంటే తనకు బాధవుతుందన్నారు. ఆగస్టు 18 వరకు సమస్యలు పరిష్కరిస్తానని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ తర్వాత సమస్యలు పరిష్కారం కాకపోతే హైదరాబాద్ దిగ్బంధం కోసం ఉద్యోగ సంఘాలు పిలుపు ఇవ్వాలని సూచించారు. మీ భుజం తట్టి మీ కోసం తాము పోరాటం చేస్తామని మీకు హామీ ఇస్తున్నా కవిత స్పష్టం చేశారు. అదే విధంగా అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలు కూడా తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీతాలు రాకపోయినా సరే ప్రజలు ఇబ్బంది పడవద్దని వారంతా ఇంకా పనిచేస్తున్నారని తెలిపారు. వెంటనే వారికి బకాయి పడ్డ జీతాలు చెల్లించి వారి సమస్యలు తీర్చాలని ప్రభుత్వానికి కవిత సూచించారు.

బోసి శ్రీ వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



తానూర్, సెప్టెంబర్ 15(ప్రజా కలం): తానూర్ మండలంలోని బోసి గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వామివారి దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు,అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఉత్తమ్ బాలేరావ్, బోసి గ్రామ సర్పంచ్ పసుల సాగర బాయి – నాగనాథ్, విడిసి చైర్మన్ రోగల్ బాలాజీ, ఉప సర్పంచ్ సల్ల లక్ష్మణ్ మరియు గ్రామస్తులు ప్రజాప్రతినిధులను, నాయకులను ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తూము దత్తాత్రి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం

– ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
– అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 15 (ప్రజాకలం) :

నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకొని ప్రతి శాఖకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. జాతీయ జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సభా వేదిక అలంకరణ, జాతీయ పతాకం ఏర్పాటు తదితర పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం వీఐపీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. షామియానాలు, కుర్చీలు, బ్యారికేడ్లు, తాగునీటి వసతులను సమకూర్చాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఆహ్వాన పత్రికల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్య అతిథి సందేశం తదితర కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్లు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రాథమిక దశలోనే దృష్టిలోపాలను గుర్తించి సరిచేయాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ కె. కృష్ణ

నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 15 (ప్రజాకలం) :

విద్యార్థుల్లో దృష్టిలోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలో మంగళవారం కంటి పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 326 ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 39,550 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ వరకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాలు, నేత్రాధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు దృష్టిలోపాలకు గల కారణాలపై అవగాహన కల్పిస్తున్నారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాల్సిన అవసరంపై విద్యార్థులకు సూచనలు అందిస్తున్నారు. పరీక్షల్లో దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్. సురేష్ బాబు, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి డాక్టర్ మహతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం మత పెద్దలతో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల సమావేశం



నిర్మల్ సెప్టెంబర్ 15 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ శోభాయాత్రను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో మరియు సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో ప్రజల మధ్య ఉన్న సోదరభావం, వరన్పర నహకారం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. ముస్లిం మత పెద్దలు తమ చిన్ననాటి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు. గతంలో గణేష్ ఉత్సవాల సమయంలో హిందూ సోదరులతో కలిసి పాల్గొన్న సందర్భాలను గుర్తుచేసుకుంటూ, నిర్మల్‌లో ప్రజల మధ్య ఉన్న స్నేహభావం, సోదరభావం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లు, తమకు ఉన్న సూచనలు మరియు సమస్యలను మత పెద్దలు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సూచనలు, అభ్యర్థనలను జిల్లా ఎస్పీ సానుకూలంగా విని, ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసు శాఖ అందుబాటులో ఉంటుందని, అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలందరూ తనకు సమానమేనని, ఎవరికైనా ఏదైనా సమస్య లేదా ఇబ్బంది ఎదురైతే తనను సంప్రదించవచ్చని, వారి సమస్యలను విని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

ఉత్సవాలు, శోభాయాత్ర మరియు నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రజలందరి సహకారంతో నిర్మల్ జిల్లాలో శాంతి, సోదరభావం మరియు పరస్పర గౌరవంతో గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దామని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, తో పాటు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, ప్రవీణ్, సమ్మయ్య పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువు నేర్పాలి

– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ సెప్టెంబర్ 15 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువు నేర్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ముధోల్ కేజీబీవీను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బందికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులకు అన్ని పూటల మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని తరగతులకు సంబంధించిన సిలబస్ ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే ప్రణాళిక ప్రకారం వారిని సిద్ధం చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి, ఇప్పటివరకు పూర్తయిన సిలబస్, రోజువారిగా అందిస్తున్న భోజనం, వసతి, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గణితం సబ్జెక్టుకు సంబంధించి పలు లెక్కలను బోర్డుపై విద్యార్థులతో చేయించి, లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించి, పెన్నులను బహుమతులుగా ఇచ్చారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ఏ సబ్జెక్టులో అయినా ఎటువంటి సందేహాలు ఉన్న వెంటనే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమీపంలో నిర్మాణం చివరి దశకు చేరుకున్న పాఠశాల భవంతిని కలెక్టర్ పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి భవనాన్ని వినియోగానికి తేవాలని తెలిపారు. ఈ తనిఖీలో డీఈవో భోజన్న, తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కొయ్య బొమ్మల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

– పానికి చెట్ల పెంపకానికి ప్రోత్సాహం.. పుష్కరాల్లో విక్రయాలు, ప్రదర్శనకు స్టాళ్లు – జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ సెప్టెంబర్ 15 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ కొయ్య బొమ్మల కళను పరిరక్షిస్తూ, కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని కొయ్య బొమ్మల ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొయ్య బొమ్మల చరిత్ర, తయారీ విధానం, మార్కెటింగ్, కళాకారుల పరిస్థితి, పానికి కర్ర లభ్యత తదితర అంశాలపై నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మల్ కొయ్య బొమ్మలకు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కళ ద్వారా నిర్మల్ జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బొమ్మల తయారీకి ప్రధానంగా ఉపయోగించే పానికి చెట్ల పెంపకానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను నిర్మల్ కొయ్య బొమ్మల మార్కెటింగ్‌కు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. బాసరలో రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా కొయ్య బొమ్మల ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొయ్య బొమ్మల కళ అభివృద్ధి, కళాకారులకు మరింత ప్రోత్సాహం, మార్కెటింగ్ అవకాశాల పెంపు తదితర అంశాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరిశీలనలో డీపీవో శ్రీనివాస్, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసీల్దార్ రాజు, అధికారులు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 15:

మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన శ్రీ గణపతి విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె కోరారు. జిల్లాలో వినాయక చవితి వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించి పండుగను సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని ఆమె



సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయిశివాని, క్లాస్-4 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షులు

– పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచన

మల్హర్, సెప్టెంబర్ 15 ప్రజాకలం ప్రతినిధి : ఇటీవల నూతనంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నియమితులైన మహాదేవపూర్, మహాముత్తారం, కాటారం, మలహర్ మండలాల అధ్యక్షులు జాడి రాజయ్య, కట్కం అశోక్, తెప్పెల దేవేందర్ రెడ్డి, జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్ లు మంగళవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.తమపై నమ్మకంతో మండల అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు మంత్రి శ్రీధర్ బాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో నెలకొన్న అభివృద్ధి, ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సమిష్టిగా పనిచేయాలని తెలిపారు.మండల అధ్యక్షులు వివరించిన సమస్యలపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



గృహాలను సేకరించి పరిహారం ఇప్పించాలని సబ్ కలెక్టర్ కు భునిర్వసితుల వినతిపత్రం



మల్హర్, సెప్టెంబర్ 15 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచర్లలోని రెవెన్యూ, పీహెచ్‌సీ సమీక్షకు వచ్చిన కాటారం సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మను మంగళవారం తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి, ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు, భూనిర్వాసితుల కమిటీ ఉపాధ్యక్షుడు బండి రాజయ్య ఆధ్వర్యంలో నాయకులు కలిసి భూనిర్వాసితుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.తాడిచర్లలోని టిజి జెన్కో ఓసిపి కి 500 మీటర్ల డేంజర్ జోన్ లో నివాస గృహాల ప్రజలు దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఓసీపీ బ్లాస్టింగ్‌ల కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయని వారు తెలిపారు. డేంజర్ జోన్ పరిధిలో ఉన్న గృహాలను సర్వే పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే పరిహారం అందించాలని కోరారు.డేంజర్ జోన్‌లో ఉన్న కుటుంబాలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే ఇళ్ల సర్వేలో తలెత్తిన సమస్యలను పరిశీలించి అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.భూనిర్వాసితుల సమస్యలపై సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భూనిర్వాసితుల కమిటీ సభ్యులు అశోక్ రావు, కేసరపు చంద్రయ్య, రామిడి గట్టయ్య, అర్ని సత్యనారాయణ, అజ్మత్ అలీ, బూడిది రాజసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడిచర్ల పీహెచ్‌సీని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ

– రోగులకు వైద్యం నిర్లక్ష్యం చేయకుండా చూడాలని సూచన...



మల్హర్, సెప్టెంబర్ 15 ప్రజాకలం ప్రతినిధి...

తాడిచర్ల: కాటారం సబ్ కలెక్టర్ శ్రీ సౌరబ్ శర్మ తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను, వైద్య సేవలను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు, ముఖ్యంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలని, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం తాడిచర్ల తహశీల్దార్ కార్యాలయాన్ని కూడా సందర్శించిన సబ్ కలెక్టర్ రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కే. రవికుమార్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బోసిలో శ్రీ వరసిద్ధి వినాయకుని దర్శించుకున్న ముధోల్ సీఐ రవీందర్ నాయక్

తానూర్, సెప్టెంబర్ 15 (ప్రజా కలం):మండలంలోని బోసి గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని మంగళవారం ముధోల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవీందర్ నాయక్, తానూర్ ఎస్సై షేక్ జుబేర్‌తో కలిసి దర్శించుకున్నారు,ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు, స్థానిక గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు పోలీసు అధికారులకు సాదర స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు,అనంతరం సీఐ మాట్లాడుతూ... వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు,ఉత్సవ సమితి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రజా కలం
బుధవారం, సెప్టెంబర్ 16, 2026

మార్కెట్‌లో ధరల జోరు..
ఇంట్లో బడ్జెట్ బేజారు!

నెల మొదట్లో చేతికి వచ్చే జీతం.. నెలాఖరుకు కనిపించని పొదుపు. బియ్యం, పప్పులు, వంటనూనెలు, కూరగాయలు, పాలు వంటి నిత్యావసరాలపై చేసే ఖర్చు కుటుంబ బడ్జెట్‌లో క్రమంగా పెరుగుతోంది. ప్రతి వస్తువు ధర ఒకే స్థాయిలో పెరగకపోయినా, కొన్ని కీలక ఆహార పదార్థాల ధరల్లో చోటుచేసుకుంటున్న తీవ్ర హెచ్చుతగ్గులు సామాన్య కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఆగస్టు 2026లో దేశ ఆహార ద్రవ్యోల్బణం 5.95 శాతానికి చేరింది. జూలైలో ఇది 5.52 శాతం. ఇదే సమయంలో మొత్తం వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం 4.82 శాతానికి పెరిగింది. కొన్ని ఆహార పదార్థాల ధరల పెరుగుదల మరింత గణనీయంగా ఉంది. ఆగస్టులో అల్లం ధరల వార్షిక పెరుగుదల 73.82 శాతం, ఉల్లి 48.27 శాతం, వెల్లుల్లి 43.60 శాతంగా నమోదయ్యాయి. బియ్యం ధరల ద్రవ్యోల్బణం కూడా 5.88 శాతానికి చేరింది. అయితే టమాటా, బంగాళాదుంప వంటి కొన్ని కూరగాయల ధరలు తగ్గడం కూడా గమనార్హం. అంటే మార్కెట్‌లో ధరల పరిస్థితి ఏకరీతిగా కాకుండా పంట, ప్రాంతం, కాలానుగుణ సరఫరాను బట్టి మారుతోంది. ఈ ధరల ఒత్తిడికి ప్రధాన కారణాల్లో వాతావరణ పరిస్థితులు ఒకటి. వర్షపాతం లోపించడం లేదా అస్తవ్యస్తంగా ఉండటం పంటల దిగుబడిని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి పంటల్లో స్వల్ప సరఫరా లోటు కూడా మార్కెట్ ధరలను వేగంగా పెంచగలదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు విస్తీర్ణంలో తగ్గుదల, అసమాన వర్షపాతం కూడా ఆహార సరఫరాపై ఆందోళనలకు కారణమయ్యాయి. ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వరకు చేరే మార్గంలో రవాణా, నిల్వ, ప్యాకేజింగ్, శీతలీకరణ వంటి ఖర్చులు కూడా తుది ధరపై ప్రభావం చూపుతాయి.

త్వరగా పాడయ్యే కూరగాయలు, పండ్ల విషయంలో కోత అనంతర నష్టాలు ఎక్కువైతే అందుబాటులో ఉన్న సరఫరా తగ్గి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్లలో మార్పులు వంటనూనెల వంటి దిగుమతి ఆధారిత వస్తువులపై కూడా ప్రభావం చూపుతాయి. అందుకే ధరల నియంత్రణకు తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం. పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని పెంచడం, వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలను ప్రోత్సహించడం, సూక్ష్మ సాగునీటిని విస్తరించడం కీలకం. పంట కోత అనంతరం నిల్వ చేసుకునే గిడ్డంగులు, శీతల గిడ్డంగుల సామర్థ్యాన్ని పెంచాలి. రైతు ఉత్పత్తి నుంచి వినియోగదారుడి కొనుగోలు వరకు మధ్యలో జరిగే అనవసర వ్యయాలను తగ్గించే సరఫరా వ్యవస్థలు మరింత బలోపేతం కావాలి. అదే సమయంలో ధరలపై పారదర్శక సమాచారం అందుబాటులో ఉండటం, మార్కెట్‌లో పోటీ పెరగడం, వినియోగదారులు స్థానికంగా లభించే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం కూడా ఉపయోగకరం. ధరల హెచ్చుతగ్గులను ముందుగానే గుర్తించే వ్యవస్థలు ఉంటే సరఫరా అంతరాలను వేగంగా పూడ్చే అవకాశం ఉంటుంది. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి అందుబాటు ధర–ఈ రెండింటి మధ్య సమతుల్యతే ఆరోగ్యకరమైన ఆహార ఆర్థిక వ్యవస్థకు పునాది. ధరలను కేవలం నియంత్రించడం కంటే ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వ్యవస్థలను సమర్థంగా మార్చడం ద్వారానే దీర్ఘకాలిక ధర స్థిరత్వం సాధ్యమవుతుంది.

- సి.హెచ్. ప్రతాప్

వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో
ప్రజా పోరాటాలు నిర్వహిస్తాం
– సాయుధ పోరాట చరిత్రను బీజేపీ–ఆర్ఎస్ఎస్ వక్రీకరిస్తున్నాయి
– సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 15 (ప్రజా కలం):

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవంలో భాగంగా మంగళవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు జండా ఊపి బైక్ యాత్రను ప్రారంభించారు ఈ యాత్రను బిజినపల్లి నుండి ప్రారంభమై పాలెం మీదుగా చేరుకొని జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ లో గల బస్టాండ్ వద్ద తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాలి ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలను నిర్వహిస్తామని అన్నారు.సాయుధ పోరాట చరిత్రను బిజెపి ఆర్ఎస్ఎస్ వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టులు, ఆంధ్ర మహాసభ కలిసి భూమి కోసం, విముక్తి కోసం, పేద ప్రజల హక్కుల కోసం సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించారని తెలిపారు. 'బాంచన్ దొరా.. నీ కాల్మొక్త' అంటూ దొరల పెత్తనాన్ని భరిస్తున్న పరిస్థితుల నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు సాయుధ పోరాటం సాగిందన్నారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, బందగి వంటి అమరుల ప్రాణత్యాగాలతో ప్రారంభమైన ఈ పోరాటం నిజాం పాలనను గద్దె దించే వరకు కొనసాగిందని పేర్కొన్నారు. దొరలు, జాగీర్దారులు, నిజాం నవాబు కలిసి పేద ప్రజలను చిత్రహింసలకు గురిచేస్తున్న సమయంలో అందుకు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని హిందూ–ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం దుర్మార్గమని వారు అన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇలాంటి తప్పుడు ప్రచారంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ చరిత్రలో చరిత్రహీనులుగా మిగిలిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం శ్రీనివాసులు,గుంపల్లి అశోక్,నాగపూర్ మధు,అంతటి కాశన్న, పొదిలి రామయ్య, లక్ష్మణ్,నందిపేట భాస్కర్, సత్యనారాయణ, వెంకటేష్, శ్రీశైలం,శివరాం,మల్లేష్,రమేష్,తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ప్రభుత్వం
ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



ఖమ్మం సెప్టెంబర్ 15(ప్రజా కలం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మయూరి సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు . తెలంగాణ నిర్మాణంలో ప్రత్యేక పాత్ర పోషించిన తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులను ప్రభుత్వం ఆదుకొని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు . గత బిఆర్ఎస్ ప్రభుత్వం కొంతమంది కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగ అవకాశాలు కల్పించి మిగతా కళాకారులకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు . తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ కళను ఆయుధంగా మార్చుకుని పాటను పోరాటంగా మలిచి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులు నేడు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో తమ కుటుంబాలను పోషించుకోలేక రోడ్డున పడ్డారని అన్నారు . ఆత్మహత్యలకు పాల్పడుతూ గోచారమైన పరిస్థితిలో జీవిస్తున్నారని పేర్కొన్నారు . తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఇప్పటికి 12 సంవత్సరాలు దాటింది . తమ కలను శ్రమను సమన్వయం చేస్తూ తెలంగాణ కోసం పోరాడిన వాళ్ళ జీవితలలో మార్పు రాలేదని కావున నిరుద్యోగ కళాకారుల బాధలు అర్థం చేసుకొని ఈ దసరా లోపు రాష్ట్రంలో ఉన్న 1000 మంది నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు . ఈ కార్యక్రమంలో పాత కోటి నరసింహారావు , కాలంగి లలిత , బొడ్డు నాగేశ్వరరావు , నారాటి చంద్రమోహన్ , ఎస్.కె పక్రుద్దీన్ , అద్దంకి నరసింహారావు , పెద్దపాక విజయ్ , కర్న పుల్లయ్య , తిప్పారపు నాగేంద్రబాబు , పేరాల నగేష్ తదితరులు పాల్గొన్నారు .

సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రకటించాలి
– తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి
– సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 15 ప్రజా కలం (ప్రతినిధి):

సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని సీపీఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తా నందు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి, ఆ పోరాటంలో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్టుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలని కోరారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటం భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి, సమానత్వం కోసం జరిగిందన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణ ప్రాంతంలో నిజాం నవాబు నిరంకుశ పాలన కొనసాగిందని, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు ప్రజలను వెట్టి చాకిరీ, బానిసత్వంలోకి నెట్టారని ఆరోపించారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, ప్రజలపై దమనకాండకు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య, బద్దం ఎల్లారెడ్డి, మోహినుద్దీన్, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, చంద్ర రాజేశ్వరరావు తదితరుల నాయకత్వంలో వేలాది మంది పోరాటం చేశారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సుమారు 4,500 మంది ప్రాణత్యాగం చేశారని, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఉందని ఫయాజ్ పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒక గొప్ప ప్రజా ఉద్యమమని, దాని చారిత్రక వాస్తవాలను పక్కనపెట్టి చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు.

కొంతమంది రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం చారిత్రక పోరాటానికి మతపరమైన రంగు పులుమడం సరైన విధానం కాదన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా చారిత్రక వాస్తవాలను గుర్తించి సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చి భావి తరాలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పులిజాల పరశురాములు, గడ్డం శ్రీనివాసులు,ప్రేమ్ కుమార్,సంతోష్, మండల నాయకులు దేశం సైదులు,అమీర్,శివ,మహేష్, పరశురాం గౌడ్, వెంకటయ్య, నాగరాజ్ గౌడ్,అంజి నాయక్,బాలయ్య,బాలు, తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి గణపేశ్వరాలయ అభివృద్ధి పనులపై బీజేపీ నేత గుండా ఉపేందర్ రెడ్డి ఆగ్రహం




పాలేరు సెప్టెంబర్ 15(ప్రజా కలం న్యూస్)కూసుమంచిమండల కేంద్రంలోని ప్రతిష్టాత్మక శ్రీ శ్రీ శ్రీ గణపేశ్వరాలయం అభివృద్ధి పనులపై బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సుమారు రూ.3.73 కోట్లతో చేపడుతున్న పనుల్లో భక్తుల సౌకర్యాల కంటే నిర్మాణాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా కాంక్రీట్‌తో నింపడం, ఉన్న ప్రహరీ గోడను తొలగించి రూ.1.41 కోట్లతో తిరిగి నిర్మించడం, రూ.25 లక్షలతో నిర్మిస్తున్న కళ్యాణ మండపం దిశ, భక్తులు కూర్చునే సౌకర్యాలపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. అలాగే రూ.1.25 కోట్లతో చేపడుతున్న శుభదం మండపం వల్ల ఇతర ఆలయాలు దిగువన కనిపించే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఆగమ శాస్త్ర పండితుల సలహాలతోనే పనులు జరుగుతున్నాయా? లేక కొందరి సూచనల మేరకేనా? అని ప్రశ్నించిన ఆయన, భక్తుల రద్దీ, పార్కింగ్, షాపుల కోసం ముందుగానే స్థలం సమకూర్చి ఉంటే శివరాత్రి సమయంలో ఇబ్బందులు తగ్గేవని అన్నారు. పనులను పునఃపరిశీలించి భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని గుండా ఉపేందర్ రెడ్డి కోరారు.

సెప్టెంబర్ 17న శ్రీ విరాట్ విశ్వకర్మ
యజ్ఞ మహోత్సవ కార్యక్రమం
– జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం సెప్టెంబర్ 15(ప్రజా కలం న్యూస్)సెప్టెంబర్ 17న ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్ర పటానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్తులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
నిధులను నిబంధనల ప్రకారం సద్వినియోగం చేసి, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి – ఆర్ జె డి ఎం. సోమిరెడ్డి



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 15 (ప్రజా కలం):

పి యం శ్రీ పాఠశాలలకు కేటాయించిన నిధులను నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రాంతీయ విద్యా సంచాలకులు ఆర్ జె డి ఎం. సోమిరెడ్డి సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండలం మేడిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆర్ జె డి ఎం. సోమిరెడ్డి సందర్శించారు. పాఠశాలలో పి ఎం శ్రీ పథకం కింద కేటాయించిన నిధుల వినియోగం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. తరగతి గదులు, బడి తోట, మధ్యాహ్న భోజనం, కాంపౌండ్ వాల్, సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించి పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రశ్నావళి, శబ్దావళి, చిత్రలేఖనాలను ఆర్ జె డి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రగతికి సంబంధించిన పలు సూచనలు చేశారు. అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పిఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆర్ జె డి ఎం. సోమిరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్‌తో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో పి ఎం శ్రీ పాఠశాలల్లో నిధుల వినియోగం, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని, బడి తోటలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి సమాన విద్య అవకాశాలు కల్పించాలని తెలిపారు విద్యార్థుల్లో సృజనాత్మకత, భాషా నైపుణ్యాలు విద్యా సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాల లక్ష్యాలను సాధించేందుకు అధికారులు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్ నూరుద్దీన్ విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ..

వెల్గటూర్, సెప్టెంబర్ 15, ప్రజాకలం, ప్రతినిధి:


వెల్గటూర్ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల విద్యార్థులకు పాఠశాల సిబ్బంది, నాయకులు మంగళవారం దుస్తులు (స్కూల్ డ్రెస్) పంపిణీ చేశారు. వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి 200 మందికి దుస్తులు మంజూరుకాగా వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండమీది కవిత, ఉప సర్పంచ్ గంద్ర ప్రతాప్ రావు, నాయకులు గుండాటి సందీప్ రెడ్డి, బండమీది గోపి, ఇంచార్జీ ప్రధానోపాధ్యాయుడు కొండల్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



గణనాథుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి
– పూజల్లో పాల్గొన్న దయాకర్ రెడ్డి దంపతులు

ఖమ్మం సెప్టెంబర్ 15(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి దంపతులు వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మంగళవారం ఉదయం బోనకల్ రోడ్డులోని ఎస్ఆర్ హోమ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి మండపంలో దయాకర్ రెడ్డి దంపతులు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణపతి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

దీవించి కాపాడు గణేశా

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 15:

మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల కార్యాలయంలో ప్రతిష్టించిన మహాగణపతికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలోమహబూబ్‌నగర్ నగర మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి (ఎంఎస్ఆర్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుని ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, జీవించి చల్లగా కాపాడాలని. మహబూబ్‌నగర్ నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, కార్పొరేటర్లు గిరి గౌడ్, మేగ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైత్రి యాదయ్య, చెన్నయ్య , గండేటి నర్సింహులు, రఘు దాసరి, రామకృష్ణ, బొట్టు శ్రీను, రఘు నాయక్,నాగరాజు, రమేష్ నాయక్, మరియు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్ చైర్మన్ పరిశీలన
- వట్టివాగులో పూడిక తొలగించి పరిశుభ్రంగా ఉంచాలి
- మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాకలం): గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్‌లతో కలిసి మహాలక్ష్మమ్మ దేవాలయం సమీపంలోని వట్టివాగు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వట్టివాగులో పూడిక తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నిమజ్జనం రోజున రెండు క్రేన్లు, ఒక జేసీబీని అందుబాటులో ఉంచాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. వట్టివాగు చుట్టూ భారీ కేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పట్టణంలోని ఆరపేట, రేగుంట, వెంకట్రావుపేట చెరువుల వద్ద కూడా గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈ నాగేశ్వరరావు, ఏఈ రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు గుడికందుల అజయ్, పందిరి రమేష్, నాయకులు బంగారు కాళ్ల కిషోర్, ముజీబ్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా
- రూ.8.50 లక్షల విలువైన 44 చెక్కులు పంపిణీ




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాకలం):

పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సలో ఆర్థిక భరోసా కల్పించేందుకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి పట్టణ, మండల పరిధిలోని లబ్ధిదారులకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కోరుట్ల పట్టణం, మండలానికి చెందిన 44 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 8.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తన చేతుల మీదుగా అందజేశారు. ఇందులో జగ్గాసాగర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులు కూడా పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

కోరుట్ల అభివృద్ధికి రూ.78 కోట్లు కోరిన జువ్వాడి నర్సింగా రావు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి.. అధికారులకు చర్యల కోసం ఆదేశాలు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాకలం): కోరుట్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సుమారు రూ.78 కోట్ల నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు కోరారు. తెలంగాణ సచివాలయంలో మంత్రిని కలిసి నియోజకవర్గంలోని రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఇందులో భాగంగా కల్లూర్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, సిరిపూర్–చిట్టాపూర్ రహదారి, నేషనల్ హైవే––యూసఫ్‌నగర్ రహదారులను రెండు వరుసల రహదారులుగా విస్తరించడం, మొగిలిపేటలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, వర్షకొండ–గోధూర్ రహదారి రెన్యువల్, మెట్‌పల్లి–దామ్‌రాజ్‌పల్లి–ఖానాపూర్ రహదారి రెన్యువల్ పనులు చేపట్టాలని కోరారు. అలాగే రంగారావుపేట–కేసీఆర్ తండా సమీపంలో స్లాబ్ కల్వర్టు నిర్మాణం, వెల్లుల గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.జువ్వాడి నర్సింగ రావు విజ్ఞప్తిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ లేఖ జారీ చేసినట్లు తెలిపారు.



కోయిలకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా - ఎం.పి.డి.ఓ కార్యాలయం, సి.హెచ్.సి, బి.సి బాలుర సంక్షేమ వసతి గృహం, జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలల్లో విస్తృత పరిశీలన



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 15:

కోయిలకొండ మండల పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మండల కేంద్రంలోని ఎం.పి.డి.ఓ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి.హెచ్.సి), బి.సి బాలుర సంక్షేమ వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాలు, సంస్థల్లో అందుతున్న సేవలు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు, మందుల లభ్యత, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు.

ఎం.పి.డి.ఓ కార్యాలయంలో పిటిషన్లు, సిబ్బంది హాజరు పరిశీలన... ముందుగా ఎం.పి.డి.ఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన పిటిషన్లు, దరఖాస్తులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్‌లో నమోదవుతున్న హాజరు వివరాలను తనిఖీ చేశారు. డైలీ సిట్యుయేషన్ రిపోర్ట్ (డి.ఎస్.ఆర్), ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదవుతున్న హాజరు వివరాలను ఎం.పి.డి.ఓ లాగిన్‌లో పరిశీలించారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన బూరుగుపల్లి సర్పంచ్‌తో కలెక్టర్ మాట్లాడి గ్రామంలో పెండింగ్ బిల్లులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, నిధుల వినియోగం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ యాప్‌లో నమోదైన వివరాలు, వివిధ పథకాల అమలు, నిధుల వినియోగానికి సంబంధించిన అంశాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత వివరాలను ఎం.పి.డి.ఓ ద్వారా సర్పంచ్‌కు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.సర్పంచ్ తెలిపిన చెక్కులపై సంతకాల సమస్యపై ఉపసర్పంచ్‌ను పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఎం.పి.డి.ఓకు సూచించారు.

సి.హెచ్.సిలో వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా

అనంతరం జిల్లా కలెక్టర్ సి.హెచ్.సి సందర్శించి ఆసుపత్రిలోని రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. కొంతమంది రోగులు ఐరన్ మాత్రలు, ఇన్సులిన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ వెంటనే స్పందించారు.

జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి ఇన్సులిన్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే స్పందించి ఇన్సులిన్‌ను తెప్పించి సంబంధిత రోగికి అందించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల స్టాక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు.

బి.సి బాలుర సంక్షేమ వసతి గృహంలో వసతులు, ఆహారం పరిశీలన

అనంతరం కలెక్టర్ బి.సి బాలుర సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సిబ్బంది, స్టోర్‌రూమ్, ఆహార సరుకుల నిల్వలను పరిశీలించారు. పప్పు, ఇతర సరుకుల నిల్వలను పరిశీలించి, వాటిని విద్యార్థులకు సక్రమంగా అందిస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని ఆరా తీసిన కలెక్టర్, ఉదయం అందించిన అల్పాహారం వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.

పాఠశాలలో పారిశుద్ధ్యం, విద్యార్థుల సౌకర్యాల పరిశీలన

అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల పరిసరాలను పరిశీలించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నారా, గతంలో ఎప్పుడు ఫాగింగ్ చేపట్టారనే వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.అక్కడ ఉన్న సర్పంచ్‌ను పంచాయతీ కార్యదర్శి క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.10వ తరగతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తరగతి గదిలో ఫ్యాన్ పనిచేయకపోవడాన్ని గమనించిన ఆమె, వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచి వాతావరణంలో విద్యాబోధన జరిగేలా చూడాలని సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని, మురుగు కాలువలను నిత్యం శుభ్రం చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు మత్తు పదార్థాలు విక్రయించకుండా అప్రమత్తంగా ఉండాలి

పాఠశాల సమీపంలోని చిన్న దుకాణాన్ని కూడా కలెక్టర్ పరిశీలించి అక్కడ విక్రయిస్తున్న సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన పదార్థాలు విక్రయించకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కోయిలకొండ ఎం.పి.డి.ఓ ధనుంజయరావు, ఇతర మండల అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత



జగిత్యాల/కొడిమ్యాల, ప్రతినిధి సెప్టెంబర్ 15(ప్రజాకలం):

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన రీ సర్వే పనులను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. మంగళవారం కొడిమ్యాల మండలం శనివారం పేట్ గ్రామంలో కొనసాగుతున్న నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే, ఎంజాయ్‌మెంట్ రీ సర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన రీ సర్వే విస్తీర్ణం, ఇంకా చేపట్టాల్సిన పనులు, నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా ఉన్న ప్రణాళికపై రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు. గ్రామ సరిహద్దులను ముందుగా నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు.గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. తొలుత లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు కలిసి గ్రామ సరిహద్దుల రీ సర్వే నిర్వహిస్తారని, అనంతరం రైతుల వారీగా భూముల రీ సర్వే చేపడతారని వివరించారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని బి.ఎస్. లత తెలిపారు. ప్రస్తుతం ఎంజాయ్‌మెంట్ రీ సర్వే కొనసాగుతోందని, నడికుడ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్థులు అడిగిన సందేహాలకు ఆమె తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజా కళా జాతరను విజయవంతం చేద్దాం

- యాభై రెండేళ్ల అరుణోదయంలో.. యాభై ఏళ్ల విమలక్క పాటల ప్రస్థానం
- 50 గంటల పాటు ఏకధాటిగా ఆటా పాటల ప్రజా కళాజాతర



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 15(ప్రజాకలం) అరుణోదయ సాంస్కృతిక సంస్థ, జగిత్యాల జిల్లా కళాకారుల ఐక్య వేదిక, మెట్ పల్లి లలిత కళా సమితి ఆధ్వర్యంలో ప్రజా కళా జాతర కార్యక్రమ కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లలిత కళా సమితి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఈ నెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆటా పాటల ప్రజా కళాజాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాభై రెండేళ్ల అరుణోదయ సాంస్కృతిక ప్రస్థానంలో విమలక్క 50 ఏళ్ల పాటల ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రజా కళాజాతరలో కవులు, కళాకారులు, రచయితలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, పీడిత ప్రజల సంక్షేమం, సమసమాజ నిర్మాణం కోసం విమలక్క తన పాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచారని వక్తలు గుర్తుచేశారు. ముఖ్యంగా తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో గజ్జె కట్టి పాటలు పాడుతూ, ధూంధాం కార్యక్రమాల ద్వారా ప్రజలను ఉద్యమం వైపు నడిపించిన గొంతుకగా విమలక్క నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య కన్వీనర్ కోటగిరి వెంకటస్వామి, జగిత్యాల జిల్లా కళాకారుల ఐక్య వేదిక అధ్యక్షులు మల్లిక్ తేజ, జాయింట్ సెక్రటరీ గడ్డం రమేష్, ఈసీ సభ్యులు పి.ఎల్.రెడ్డి, సభ్యులు క్రాంతి, లలిత కళా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టెల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కోటగిరి చైతన్య, డీఎల్ఎన్ వర్మ, అనంతం, శేఖర్, జయవీర్, రహీం, అరుణోదయ కళా సంస్థ కళాకారులు శ్రీనివాస్, తాటికొండ లత, లక్ష్మీ, లత తదితర కవులు, కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు పాల్గొన్నారు.

గణేష్ నగర్ గణనాథునికి పూజలు



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాకలం) గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ నగర్ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద నిత్య పూజలు, భోగాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ నగర్ సంక్షేమ మండలి గౌరవ అధ్యక్షులు చెన్నమనేని సంతోష్ రావు, అధ్యక్షులు ఎల్లాల రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటాల రవీందర్ తోపాటు పాము సత్యనారాయణ, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, యాచమనేని వెంకట రామారావు, ముదిగంటి సంతోష్ రెడ్డి, సంగని చంద్రశేఖర్, తాటిపర్తి అంజిరెడ్డి, ఎల్లబోయిన రమేష్ బాబు, పడకండి శ్రీనివాస చారి, పల్లెర్ల ప్రభాకర్, యాదగిరి రామారావు, ఎల్.జి. గార్డెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన విద్యార్థులకు పథకాల ప్రదానం

మల్లాపూర్, సెప్టెంబర్ 15 (ప్రజా కలం ప్రతినిధి):

ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రీడా పోటీల్లో కొత్త ధామ్ రాజ్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ఎగ్గరపు లింబాద్రి ఆధ్వర్యంలో పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లింబాద్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచినట్లుగానే జిల్లాస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ బద్ద హరీష్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు గంగాధర్, పరమేశ్వర్, రాజయ్య, నరేష్, శైలజ, అనిత తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

- నిమజ్జనంలోగా మార్కింగ్ నిర్మాణాలు ఖాళీ చేయాలి
- ప్రభుత్వ విప్ విజయరమణారావు

పెద్దపల్లి:సెప్టెంబర్ 15:((ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పట్టణ అభివృద్ధికి వ్యాపారులు,ప్రజలు అందిస్తున్న సహకారం అభినందనీయమని, అందరి భాగస్వామ్యంతోనే శీఘ్ర ప్రగతి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పట్టణ ప్రజల చిరకాల కోరికైన జండా చౌరస్తా నుండి పెద్ద మసీదు వరకు చేపట్టిన మెయిన్ రోడ్డు వెడెల్పు పనులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కౌన్సిలర్లు,అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెండా చౌరస్తా నుండి మసీదు వరకు ఉన్న 80 ఫీట్ల రోడ్డును మున్సిపల్ కౌన్సిల్ 60 ఫీట్లకు తీర్మానించినప్పటికీ,స్థానిక వ్యాపారస్తుల విజ్ఞప్తి మేరకు 55 ఫీట్లకు కుదించామని తెలిపారు. దాదాపు 90 శాతం మంది వ్యాపారులు స్వచ్ఛందంగా తమ కట్టడాలను తొలగించుకుని సహకరించినందుకు పట్టణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని,మిగిలిన 10 శాతం మంది కూడా అధికారుల మార్కింగ్ ప్రకారం వినాయక నిమజ్జనం లోగా నిర్మాణాలను తొలగించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.వారం రోజుల్లో 80 శాతం రోడ్డు పనులు పూర్తి చేస్తామని,ఒకట్రెండు రోజుల్లో మురికి కాలువల నిర్మాణం చేపట్టడంతో పాటు విద్యుత్ వైర్ల ఇబ్బంది లేకుండా స్తంభాలకు బదులుగా టవర్లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్,ఏఈ రాజ్‌కుమార్,కౌన్సిలర్లు,నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియను

వేగవంతం చేయాలి

– జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ – 6 ఏళ్లు నిండిన ప్రతి చిన్నారికి బయోమెట్రిక్ నవీకరణ జరిగేలా చూడాలి

– గత ఆరు నెలల ప్రసవాల వివరాలతో ప్రతి శిశువు ఆధార్ నమోదును పరిశీలించాలి

– ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలి

– ఆధార్ నమోదు, నవీకరణ పై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్-15 (ప్రజా కలం):

జిల్లాలో ఆధార్ నమోదు, ఆధార్ వివరాల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఆధార్ వివరాలు సక్రమంగా నమోదు అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల 49,413 మంది , 6-17 సంవత్సరాల వయస్సు గల 2,34,451 మంది ఆధార్ వివరాలను నమోదు చేయడం లేదా అవసరమైన మేరకు నవీకరించడం పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. వయస్సుల వారీగా ఆధార్ నమోదు, నవీకరణకు సంబంధించిన వివరాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ నమోదు కాని వారు, ఆధార్ వివరాలు నవీకరించాల్సిన వారు ఎవరూ మిగలకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని సూచించారు.

ఆరేళ్లు నిండిన చిన్నారులకు బయోమెట్రిక్ నవీకరణ

0-5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో ఫొటోగ్రాఫ్ మాత్రమే తీసుకుంటారని, బయోమెట్రిక్ వివరాలు నమోదు చేయరని జిల్లా కలెక్టర్ తెలిపారు. చిన్నారికి 6 సంవత్సరాలు నిండిన వెంటనే బయోమెట్రిక్ వివరాలు తప్పనిసరిగా నవీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర విద్యాసంస్థల్లో 6 సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారి ఆధార్‌లో బయోమెట్రిక్ నవీకరణ జరిగిందా లేదా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ నమోదు కాని పిల్లలను గుర్తించి, వారికి ఆధార్ నమోదు చేయించడంతో పాటు అవసరమైన చోట బయోమెట్రిక్ నవీకరణ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

గత ఆరు నెలల ప్రసవాల వివరాలతో పరిశీలన...

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గత ఆరు నెలల్లో జరిగిన ప్రసవాల వివరాలను సేకరించి, జన్మించిన ప్రతి శిశువుకు ఆధార్ నమోదు జరిగిందా లేదా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో గత ఆరు నెలల్లో జరిగిన ప్రసవాల జాబితాను ఆధార్ నమోదు వివరాలతో సరిపోల్చి, ఆధార్ నమోదు కాని శిశువులను గుర్తించాలని సూచించారు. ప్రతి శిశువుకు ఆధార్ నమోదు జరిగేలా తల్లిదండ్రులకు అవసరమైన అవగాహన కల్పించి, అవసరమైన చోట ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.

ప్రతి విద్యార్థి ఆధార్ వివరాలు పరిశీలించాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రతి చిన్నారి ఆధార్ కార్డు వివరాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ఆధార్ నమోదు స్థితి, ఆధార్ వివరాల నవీకరణ, ముఖ్యంగా 6 సంవత్సరాలు నిండిన పిల్లల బయోమెట్రిక్ నవీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వారీగా ఆధార్ నమోదు, నవీకరణకు సంబంధించిన వివరాలను సేకరించి పెండింగ్‌లోఉన్న పిల్లలను గుర్తించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి విద్యార్థికి అవసరమైన ఆధార్ సేవలు అందేలా చూడాలని సూచించారు.

ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలి

ఆధార్ నమోదు, నవీకరణ కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లో పిల్లలకు అనుకూలంగా శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఆధార్ నమోదు, నవీకరణకు అవసరమైన సిబ్బంది, పరికరాలు అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, శిబిరాల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని తల్లిదండ్రులకు ముందుగానే తెలియజేయాలని తెలిపారు.

శాఖల మధ్య సమన్వయంతో ప్రక్రియ పూర్తి చేయాలి

వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ, ఆధార్ నమోదు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ తన పరిధిలో ఆధార్ నమోదు, నవీకరణకు సంబంధించిన పెండింగ్ వివరాలను గుర్తించి, నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఆధార్ వివరాల్లో పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి, అవసరమైన చోట్ల నవీకరించాలని తెలిపారు. ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. చిన్నారులకు ఆధార్ నమోదు, 6 సంవత్సరాలు నిండిన తర్వాత బయోమెట్రిక్ నవీకరణ ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందించి, పెండింగ్‌లో ఉన్న ఆధార్ నమోదు, నవీకరణను పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరి ఆధార్ వివరాలు నమోదు కావడంతో పాటు, అవసరమైన నవీకరణలు పూర్తయ్యేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మధుసూదన్ , దివాకర్ రెడ్డి , నరసింహారావు, కలెక్టరేట్ సెక్షన్స్ సూపర్ ఇండెంటు జ్యోతి, యూఐడీఏఐ హైదరాబాద్ ఆర్వో శ్రావణ్,ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ మమత,డీడబ్ల్యూఓ భాస్కర్, డీఈఓ రాము, డీఎంహెచ్‌వో సుజాత, ఎల్‌డీఎం రాము, పోస్టల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు



పెద్దపల్లి,సెప్టెంబర్15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు ఘనంగా,పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు,ప్రోటోకాల్ ప్రకారం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. వేడుకలకు సంబంధించి శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని,కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వేడుకలు నిర్వహించే ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వేదిక,డయాస్,సీటింగ్, బ్యారికేడింగ్,విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు,అధికారులు,ప్రముఖులు, ఆహ్వానితులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకల ప్రాంగణంలో త్రాగునీరు,పారిశుద్ధ్యం, విద్యుత్,అత్యవసర సేవలకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. వైద్య బృందాలను అందుబాటులో ఉంచడంతో పాటు అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ప్రోటోకాల్ ప్రకారం సంబంధిత ప్రజాప్రతినిధులు,అధికారులు, ప్రముఖులకు సకాలంలో అందించాలని అన్నారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు,సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాల వివరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని,ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత శాఖలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ముఖ్య అతిథి ప్రసంగానికి అవసరమైన ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను సకాలంలో అందించాలని అన్నారు. వేడుకల సందర్భంగా శాంతిభద్రతలు,ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్,బందోబస్తు తదితర ఏర్పాట్లను పోలీస్ శాఖ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని,చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్,సంబంధిత జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,సెప్టెంబర్15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్‌పల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను, సుల్తానాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సుల్తానాబాద్ 5వ వార్డులోని శ్రీ వాణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

యంగ్ ఇండియా పాఠశాల పనులు వేగవంతం చేయాలి

ర్యాకల్ దేవ్‌పల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్ణీత కాలపరిమితికి అనుగుణంగా పనులు పూర్తి చేసేలా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు.

అదనపు తరగతి గదులను రెండు నెలల్లో పూర్తి చేయాలి

సుల్తానాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను రెండు నెలల వ్యవధిలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు సకాలంలో అందేలా పనులను వేగవంతం చేయాలని,నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఎస్ఐఆర్ విచారణను మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి

సుల్తానాబాద్ 5వ వార్డులోని శ్రీ వాణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ విచారణను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని,సమర్పించిన ప్రతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

ఓటర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు సంబంధించిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో పూర్తి ఖచ్చితత్వంతో నమోదు చేయాలని,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్,తహసీల్దార్ లు యాకన్న,బషీరోద్దీన్,డిప్యూటీ ఈఈ బాబు రెడ్డి,మారుతి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పాఠశాల చైర్ పర్సన్ స్వరూప – ఊషన్నపల్లి పాఠశాలలో అల్పాహార పథకం ప్రారంభం



పెద్దపల్లి:సెప్టెంబర్15:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన నాణ్యమైన విద్యను అందిస్తున్నారని,తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కాల్వ శ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చైర్పర్సన్ పెండ్లి స్వరూప అన్నారు. మంగళవారం పాఠశాలలోని బాల బాలికల కోసం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యతో కలిసి ప్రారంభించారు. పిల్లలకు ఉదయాన్నే ప్రభుత్వం ఉచితంగా సరపరా చేసిన ఇడ్లీ,సాంబారు,పాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని,చదువులో పిల్లల్ని అద్భుతంగా తయారు చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఆమె కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు బ్రేక్ఫాస్ట్,మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తోందని,ఇవి పిల్లలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనివల్ల పిల్లల్లో శారీరక,మానసిక ఎదుగుదల అధికమవుతుందని,తద్వారా వారు చాలా బాగా చదవగలుగుతారని,జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. అన్ని సౌకర్యాలతో ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అద్భుతంగా తయారుచేస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఆయన కోరారు. పాఠశాల చైర్పర్సన్ పెండ్లి సరూప, ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య,ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్,మంద శ్రీవాణి,ఎడ్ల స్రవంతి, బండారి సరిత,బండారి శంకర్,ధరణి మణికంఠ చారి, తల్లిదండ్రులు,పిల్లలు,పలువురు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

-ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి:సీపీ అంబర్ కిషోర్ ఝా



పెద్దపల్లి:సెప్టెంబర్ 15:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వాడుకుంటూ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని,రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల,పెద్దపల్లి డీసీపీలు ఏ.భాస్కర్,బి.రామ్‌రెడ్డి సహా ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆగస్టు నెల నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పాత కేసులు, పోక్సో, మహిళలపై నేరాలు,గంజాయి రవాణా,ఆస్తి నేరాల దర్యాప్తును వేగవంతం చేసి ఎఫ్ఎస్ఎల్ నివేదికలు త్వరగా వచ్చేలా చూడాలని, తీవ్రమైన కేసులపై డీసీపీలు వారానికోసారి ప్రత్యేక సమీక్ష జరపాలని స్పష్టం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో విస్తృత గస్తీ,ఆకస్మిక వాహన తనిఖీలతో పాటు విజిబుల్ పోలీసింగ్ పెంచాలని సూచించారు. ఇక వినాయక మండపాల వద్ద డీజేల ఏర్పాటుకు ఎలాంటి అనుమతి లేదని తేల్చిచెప్పిన ఆయన,విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాలని,ప్రతి మండపం వద్ద పాయింట్ పుస్తకం అందుబాటులో ఉంచాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా లేదా షేర్ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ,వీటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సోషల్ మీడియా విభాగాన్ని, కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థకు మహర్దశ

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు – ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత అల్పాహారం



పెద్దపల్లి:సెప్టెంబర్15:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు హరే రామ కృష్ణ ఫౌండేషన్ సౌజన్యంతో కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయాన్నే పనులకు వెళ్లే పేద తల్లిదండ్రుల పిల్లలు ఆకలితో అలమటించకుండా నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం వారానికి 6 రోజులు ఇడ్లీ,పూరీ,దోశ,మిల్లెట్ టిఫిన్లతో పాటు పాలు పంపిణీ చేస్తోందని,గత రెండేళ్ల ప్రజా పాలనలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.65 కోట్లు వెచ్చించి మన బడుల్లో విద్యా ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరిచామని తెలిపారు. అంతేకాకుండా,పెద్దపల్లి నియోజకవర్గంలో కులమత బేధాలు లేకుండా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులందరికీ ఒకే చోట అత్యుత్తమ విద్యను అందించేందుకు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని,రాబోయే ఏడాది కాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్,మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్,సింగిల్ విండో చైర్మన్లు,మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- అక్రమ కలప రవాణా, అటవీ నేరాల నివారణకు ప్రత్యేక నిఘా
- అటవీ–రెవెన్యూ భూ రికార్డుల వ్యత్యాసాలను రీసర్వేలో పరిష్కరించాలి
- రిజర్వ్‌డ్ ఫారెస్ట్ భూముల్లో అనధికార పట్టాలపై సమగ్ర పరిశీలన
- అటవీ సంరక్షణలో రెవెన్యూ శాఖ సహకారం అందించాలి

జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్15 (ప్రజా కలం):

జిల్లాలో అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీలో నిర్వహించిన జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో అటవీ విస్తీర్ణం, అటవీ భూముల ఆక్రమణలు, అటవీ–రెవెన్యూ భూ రికార్డుల వ్యత్యాసాలు, అనధికార పట్టాలు, అటవీ నేరాల నివారణ, ఎస్ఆర్ఎల్ఐపీ ప్రాజెక్టుకు సంబంధించిన భూ వివాదాలపై సమీక్షించారు.

జిల్లాలో 53,734.78 హెక్టార్ల అటవీ విస్తీర్ణం

జిల్లాలో మొత్తం 53,734.78 హెక్టార్ల అటవీ విస్తీర్ణం, అంటే 1,32,778.66 ఎకరాలు ఫారెస్ట్ రికార్డుల్లో నమోదై ఉన్నట్లు అధికారులు వివరించారు. మొత్తం అటవీ ప్రాంతం 5 రేంజ్‌లు, 22 సెక్షన్లు, 67 బీట్లు, 253 కంపార్ట్‌మెంట్ల పరిధిలో ఉంది.

ఫారెస్ట్–రెవెన్యూ రికార్డుల రీకన్సిలియేషన్

ఫారెస్ట్ రికార్డులు, రెవెన్యూ రికార్డుల్లోని 22ఏ1 పహాణి వివరాలను సరిపోల్చి రీకన్సిలియేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫారెస్ట్ రికార్డుల ప్రకారం 1,32,778.66 ఎకరాలు ఉండగా, 22ఏ1 పహాణి రికార్డుల్లో 57,842.25 ఎకరాలు, మరో విభాగంలో 75,198.14 ఎకరాలు నమోదై ఉన్నట్లు అధికారులు వివరించారు. రికార్డుల మధ్య ఉన్న వ్యత్యాసాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టత తీనుకురావాలని, సుమారు 26 వేల ఎకరాల వ్యత్యాసానికి సంబంధించిన భూ వివాదాలను రీసర్వే కార్యక్రమంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

అటవీ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని రిజర్వ్‌డ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అటవీ భూముల ఆక్రమణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ధర్మపురి రేంజ్‌లో 3,649.88 ఎకరాలు, మెట్‌పల్లి రేంజ్‌లో 621.92 ఎకరాలు, కోడిమియాల్ రేంజ్‌లో 91.05 ఎకరాల ఆక్రమణలు నమోదైనట్లు తెలిపారు. రాయికల్ రేంజ్‌లో 114.23 ఎకరాలకు సంబంధించిన ఆక్రమణ, భూ వివాదాలు ఉన్నట్లు అధికారులు వివరించారు. అటవీ భూములపై హక్కులు కోరుతున్న గ్రామీణులు, గిరిజనులకు సంబంధించిన



అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న కేసులను మాత్రమే చట్టబద్ధమైన విధానంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

5,016.99 ఎకరాలకు అనధికార పట్టాలు

గత 20 సంవత్సరాల కాలంలో రిజర్వ్‌డ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల ద్వారా 5,016.99 ఎకరాలకు అనధికార పట్టాలు మంజూరైనట్లు అధికారులు వివరించారు. ఈ పట్టాలకు సంబంధించిన ఫారెస్ట్, రెవెన్యూ రికార్డులను పూర్తిగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా పట్టా మంజూరు చేసిన అనంతరం దానిని రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే, పట్టా మంజూరు సమయంలో అనుసరించిన అదే విధానాన్ని అనుసరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేసిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

అటవీ రెవెన్యూ శాఖల పరస్పర సహకారం అందించాలి

అటవీ సంరక్షణలో రెవెన్యూ శాఖ అధికారులు అటవీ శాఖకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంతాల అంచున ఉన్న, సమస్యాత్మక గ్రామాల్లో అటవీ సంరక్షణ కమిటీ సమావేశాల నిర్వహణలో అటవీ శాఖతో సమన్వయం చేసుకోవాలని, సంబంధిత రెవెన్యూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని సూచించారు. అటవీ భూముల ఆక్రమణలను గుర్తించడం, నివారించడంలో అటవీ శాఖకు సహకరించాలని, అటవీ–రెవెన్యూ సరిహద్దు వివాదాలను సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలనల ద్వారా పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన రెవెన్యూ, భూ రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలను పరస్పరం అందుబాటులో ఉంచి ధృవీకరించాలని సూచించారు. అక్రమంగా చెట్ల నరికివేత, అటవీ ఉత్పత్తుల అక్రమ తరలింపు, ఇతర అటవీ నేరాల నివారణ, గుర్తింపు, సమాచారాన్ని అటవీ శాఖకు అందించడంలో రెవెన్యూ అధికారులు సహకరించాలని తెలిపారు. ఆక్రమణలు, సరిహద్దు వివాదాలు, ఇతర అటవీ సంరక్షణ అంశాల్లో అటవీ అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక భూ సంబంధిత ఫిర్యాదులు, వివాదాలను పరిష్కరించడంలో రెవెన్యూ శాఖ సహకరించాలని, అటవీ సంరక్షణ, అమలు చర్యల సమయంలో అవసరమైన పరిపాలనా, క్షేత్రస్థాయి సహాయాన్ని అందించాలని సూచించారు. అటవీ సంరక్షణ కమిటీ కార్యకలాపాల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, అటవీ పరిరక్షణలో వారిని భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎస్.ఆర్.ఎల్.ఐ.పీ భూముల వివాదాల పరిష్కారం

కోరుట్ల డివిజన్‌లో ఎస్ఆర్ఎల్ఐపీ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం 610.17 ఎకరాల పరిహార భూమి కేటాయించగా, 518.28 ఎకరాలు వివాదరహితంగా, 91.29 ఎకరాలు ఆక్రమణ/వివాదంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వివాదంలో ఉన్న భూములకు ప్రత్యామ్నాయంగా అటవీ శాఖకు కేటాయించాల్సిన 91.29 ఎకరాల భూమి గుర్తింపు అంశాన్ని సమీక్షించారు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 570, 571లో 92.00 ఎకరాల రెవెన్యూ భూమిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ భూమిపై సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

అక్రమ కలప రవాణాపై నిరంతర నిఘా

జిల్లాలో గుర్తించిన అక్రమ కలప రవాణా మార్గాలు, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ నేరాలను అరికట్టేందుకు అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజ గౌడ్, ఆర్డీవోలు, జిల్లా అటవీ అధికారి రవి ప్రసాద్, అటవీ శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఏ.డి,ఎస్.ఎల్.ఆర్. కిషన్ ప్రసాద్, సంబంధిత రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డీఎస్ రెడ్యానాయక్



మరిపెడ ప్రతినిధి ప్రజా కలం న్యూస్ సెప్టెంబర్ 15

బురహాన్ పురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నలబోలు ప్రవీణ్ రెడ్డి తల్లి అనురాధ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే అయితే గ్రామస్తుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డి ఎస్ రెడ్యా నాయక్ మంగళవారం నాడు బురాన్పురం గ్రామానికి విచ్చేసి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను. అన్నారు. వారి వెంట బిఆర్ఎస్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ విశ్వ కర్మ భగవానుని సామూహిక వ్రతం

గొల్లపల్లి సెప్టెంబర్ 15 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ ఆధ్వర్యంలో వారి సంఘ భవనంలో మంగళవారం శ్రీ విశ్వకర్మ భగవానుని




వ్రతం నిర్వహించారు. ఈ వ్రతంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలభక్తుల కిషన్ ,జిల్లా అధ్యక్షుడు టివి సత్యం , జగిత్యాల పట్టణ అధ్యక్షులు సంకోజి రమణ కోరు కంటి రాము కౌన్సిలర్ ,పట్టణ అధ్యక్షులు పోలుకల రాజు గణేష్, లక్ష్మణ్ , యూత్ అధ్యక్షులు కుమార్ సజ్జనపు రవి శ్రీకోటి నీలకంఠం, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ , సంఘ సభ్యులు, యూత్ సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

వ్యభిచార ముఠా నిర్వాహకుడిపై పీడీ యాక్ట్ ప్రయోగం: పోలీస్ కమిషనర్

ఖమ్మం సెప్టెంబర్ 15(ప్రజా కలం న్యూస్)

మహిళలను వ్యభిచారంలోకి దింపి ఆర్థిక లాభాలు పొందుతున్న బత్తుల బాలకృష్ణ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం, చిరుమర్రి గ్రామానికి చెందిన నిందితుడు బత్తుల బాలకృష్ణ, 30సం,,ఆర్థిక లాభాల కోసం జిల్లాలో వ్యభిచార గృహాలను నిర్వహిస్తూ, మహిళలను వ్యభిచారంలోకి తీసుకువచ్చే అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు బాలకృష్ణపై ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో, అనైతిక రవాణా, వ్యభిచార నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2026 జనవరి 6న విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం గాంధీచౌక్‌లోని ఓ లాడ్జిలోని గది ని పోలీసులు దాడి చేశారు. వ్యభిచార కార్యకలాపాల కోసం లాడ్జిలో గది పొందేందుకు అధిక మొత్తంలో డబ్బు చెల్లించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బాలకృష్ణ, మెరెడ్డి సత్యవతి, లాడ్జి మేనేజర్ అలకుంట్ల శ్రీకాంత్ తో కలిసి కుట్రపూరితంగా వ్యవహరించినట్లు తెలిపారు. కాకినాడ కు చెందిన మహిళను ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని వ్యభిచారంలోకి తీసుకువచ్చినట్లు, ఖమ్మంకు తరలించి లాడ్జి గదిలో ఉంచి, కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడి నేర ప్రవర్తనను నిరోధించేందుకు శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం, 1986 (పీడీ యాక్ట్) సెక్షన్ 3(2) కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసి చంచల్‌గూడ సెంట్రల్ జైలు కు తరలించారు.



పేదల జీవితాల్లో 'కంటి వెలుగు'


– రంగధామునిపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



గొల్లపల్లి సెప్టెంబర్ 15 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం రంగధామునిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి రంగదామునపల్లి, అగ్గిమల్ల, తిరుమలాపూర్, లక్ష్మీపూర్, రాములపల్లి ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయగా తహసీల్దార్ మహమ్మద్ మాజీద్, ఎంపీడీవో రవీందర్ రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్ ఈ కార్యక్రమన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహమ్మద్ మాజీద్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత పేద ప్రజల అత్యాధునిక కంటి వైద్య సేవలను గ్రామంలో నిర్వహించడం ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎంతోమంది కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ దృష్టి లోపానికి గురవుతున్నారని, ఇలాంటి ఉచిత శిబిరాలు వారికి వెలుగులు నింపుతాయని పేర్కొన్నారు. పేదలకు మేలుచేసే ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలకు రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఎంపీడీవో రవీందర్ రావు మాట్లాడుతూ, గ్రామీణ పేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత కంటి శస్త్రచికిత్సల వంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా వనిచేసినప్పుడే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కంటి శిబిరంలో 82 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో కంటి శుక్లాలు, తీవ్ర సమస్యలు ఉన్న 41 మంది రోగులను శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసి ఎంపికైన రోగులను ప్రత్యేక బస్సు ద్వారా కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కంటి శిబిరానికి వచ్చిన రోగులకు సర్పంచ్ జెల్ల అఖిల,అనిల్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కాశ అంజలి గంగాధర్, కాసం రాజశేఖర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి మహంకాళి చంద్రశేఖర్, కోశాధికారి సట్ట సురేష్, మాజీ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి,నరహరి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఉప సర్పంచ్ అనగందుల శ్రీనివాస్, కొంచెట్టి తిరుపతి, నరిమెట్ల లక్ష్మి, కాసరపు సతీష్ గౌడ్, నల్యాల లక్ష్మి, నలువాల భాగ్య, వేములవాడ లాస్య, ఎనగందుల కమలాకర్, సభ్యులు, రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



(అంబర్‌పేట, సెప్టెంబర్ 15 (ప్రజా కలం): అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. శివం రోడ్డు లోని న్యూ ఆజాం కాంప్లెక్స్ లో గల సంఘం కార్యాలయంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి మర్రి హరి, ప్రధాన కార్యదర్శి చిలక శివ్ కుమార్, ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, పెద్ద బొమ్మ మధుసూదన్, అంజాల విజయ్ కుమార్, ఏ వి రాజశేఖర్, కార్యదర్శులు తీగల నరేందర్, గంగిశెట్టి మల్లేష్, రాజేందర్ నాగుల, సలహాదారులు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, చిలువేరు యాదగిరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు భోగ నీరజ, డివిజన్ల అధ్యక్షులు గంగిశెట్టి సత్తయ్య, పెద్ద బొమ్మ దామోదర్, కోట వెంకటేష్ ఎస్ నర్సింగ్ రావు, సాయిని మూర్తి, కైరం కొండ శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి వనం రమణ తదితరులు పూజలు పాల్గొన్నారు.

వర్ధన్నపేట జోనల్ స్థాయి క్రీడ ఎంపికల నిర్వహణ



(వరంగల్/పర్వతగిరి)సెప్టెంబర్ 15, ప్రజాకలం ప్రతినిధి : ఈ నెల సెప్టెంబర్ 18, 19 తేదీలలో వర్ధన్నపేట జోనల్ స్థాయి లో వివిధ క్రీడల్లో ఎంపికలు పర్వతగిరి మండలం కొంకపాక ఉన్నత పాఠశాలలో నిర్వహించబడును అని పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ జిఎఫ్ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) వర్ధన్నపేట జోనల్ సెక్రెటరీ ఎండి మహబూబ్ పాషా మాట్లాడుతూ, కోకో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో 14 సంవత్సరాలు, 17 సంవత్సరాల బాల, బాలికలు క్రీడ ఎంపికల్లో పాల్గొనవచ్చు అని తెలిపారు. దీనిలో మొదటి రోజు బాలికలు రెండవ రోజు బాలురకు పోటీలు నిర్వహించబడును అని తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు పాఠశాల నుండి బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్సులు సమర్పించవలెను తెలిపారు. ఒక్కో విభాగం నుండి ముగ్గురు విద్యార్థులు పాల్గొనవలెనని తెలిపారు. ఈ పోటీలలో వర్ధన్నపేట పర్వతగిరి రాయపర్తి మండలాలకు చెందిన గవర్నమెంట్, ప్రైవేటు స్కూల్ పాఠశాలల విద్యార్థులు మాత్రమే పాల్గొనవలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ ఎం. వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జే. రఘువీర్, ఎస్ జి ఎఫ్ ఐ వరంగల్ జిల్లా సెక్రెటరీ పి. అనిల్, ట్రెజరర్ ఎం. వెంకటేశం వర్ధన్నపేట పర్వతగిరి రాయపర్తి మండలాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

విలీన దినాన్ని అధికారికంగా జరపాలి

టీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: సెప్టెంబర్ 15: (ప్రజా కలం న్యూస్)

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల హృదయాల నుంచి చెరిపివేయలేరని తెలంగాణ గిరిజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్ స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో భూక్యా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన మహత్తర ప్రజా పోరాటమే తప్ప మతాల మధ్య ఘర్షణ కాదన్నారు. సెప్టెంబర్ 17 చరిత్రను మత విద్వేషాలకు వాడుకోవడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో సాగిన ఉద్యమ వారసత్వాన్ని తుడిచిపెట్టే యత్నాలను తిప్పికొట్టాలని, పీడిత ప్రజల హక్కుల సాధనకు ఆనాటి పోరాట స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ నాయకులు బానోతు వెంకట్, గోవిందు, ఉపేందర్, హత్తిరామ్, హరి, రమేష్, సురేష్, రమేష్ బాబు, బావు సింగ్, మోహన్, రవి, రాంప్రసాద్, చందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూమి భుక్తి విముక్తి పోరాటం చారిత్రాత్మకం

– అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

– సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: సెప్టెంబర్ 15: (ప్రజా కలం న్యూస్)

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని 3 టౌన్ పరిధి బూడిదగడ్డ సిపిఐ కార్యాలయంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా, అనంతరం నాయకులు అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, జి వీరాస్వామి మాట్లాడుతూ నిరంకుశ నిజాం, భూస్వామ్య దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక అధ్యాయమని కొనియాడారు. వేలాది మంది కమ్యూనిస్టు యోధులు ప్రాణాలర్పించి పేదలకు భూమి, భుక్తిని అందించారని గుర్తుచేశారు. నేటి పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఎర్రజెండా అండతో సమరశీల పోరాటాలు నిర్మించడమే అమరులకు నిజమైన నివాళి అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు భూక్య శ్రీనివాస్, గొనె మని, నేరెళ్ల రమేష్, విజయలక్ష్మి, నాయకులు మాచర్ల శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బోయిన విజయ్ కుమార్, బండి దుర్గ, తుమ్మ నర్సయ్య, శాపావట్ రవి, అజీజ్, గడ్డం సతీష్, ప్రభాకర్, ధనరాజ్, సాంబి రెడ్డి, నరేష్, పసునూటి రమేష్, నట్టే వీరయ్య, రాజేశ్వరరావు, శివ, సుజాత, రూపేష్, రంజిత్, ఓదెలు, సిందేం శ్రీను తదితరులు పాల్గొన్నారు.





శంషాబాద్‌లో ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శంషాబాద్, సెప్టెంబర్ 15,(ప్రజా కలం)

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శంషాబాద్ మండలంలో విద్యార్థుల అభివృద్ధికి విశేష కృషి చేసిన ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు – 2026” ను ఘనంగా అందజేశారు.. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్ లో మండల విద్యాధికారి మరియు మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విచ్చేసి, ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ భావి భారత పౌరులను, రేపటి సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంజినీర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం: అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు

గజ్వేల్:15 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ఇంజినీర్స్ డే సందర్భంగా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా



కార్యక్రమం నిర్వహించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అసోసియేషన్ సభ్యులు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ, ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను అసోసియేషన్ తరఫున భవిష్యత్తులోనూ నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ సురేష్,కార్యదర్శి మొహమ్మద్ ఉవెస్,సభ్యులు తాళ్ల నరేష్ గౌడ్,శ్రీకాంత్, బాలాజీ,సుమంత్, రాజశేఖర్ రెడ్డి,వినీత్,లింగ శ్రీకాంత్, సంజయ్,మురళి,నివేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న భక్తులు.

సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15(ప్రజా కలం): సంగారెడ్డి రామ్ మందిర్ వినాయక మండపం, వివేకానంద యూత్ అసోసియేషన్, చైతన్య యువజన సంఘం, ఐబీ యూత్ కాంగ్రెస్ గణేష్ మండపం, భరత్ సాయి రెడ్డి యూత్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో జరిగిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు. వేడుకల్లో పాల్గొన్న జయారెడ్డి, గుణ చైతన్య రెడ్డి దంపతులు, కాబోయే వధూ వరులు భరత్ సాయి రెడ్డి–పాలక్ పటేల్, నిర్మలా జగ్గారెడ్డి ఇతర కుటుంబ సభ్యులులి వినాయక చవితి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వినాయక మండపాల్లో ఏర్పాటు చేసిన తొలి రోజు పూజా కార్యక్రమాల్లో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా తొలుత రామ్ నగర్‌లోని రామ్ మందిర్ వద్ద కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జగ్గారెడ్డి స్వయంగా భజన చేస్తూ భక్తులతో కలిసి వీధుల గుండా ఊరేగింపుగా బ్రాహ్మణవాడకు చేరుకున్నారు. అక్కడి నుంచి మట్టి గణపతి విగ్రహాన్ని తీసుకువచ్చి రామ్ మందిర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రతిష్ఠించారు. అనంతరం వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయి రెడ్డి పర్యవేక్షణలో గంజి మైదాన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, అల్లుడు గుణ చైతన్య రెడ్డి తొలి పూజల్లో పాల్గొన్నారు. రామ్ మందిర్ యువసేన సభ్యుడు దత్తు ఆధ్వర్యంలో రామ్ మందిర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జరిగిన ప్రత్యేక పూజల్లోనూ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సంగారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ అధ్యక్షతన చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కూడా కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు కూన సంతోష్ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద తూర్పు భరత్ సాయి రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో భరత్ సాయి రెడ్డి, ఆయన కాబోయే సతీమణి పాలక్ పటేల్ ఆధ్వర్యంలో తొలి రోజు పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి ప్రజలకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.



దళిత,బీసీ హామీలపై రేవంత్ సర్కార్ లెక్క చెప్పాలి

-ఫామ్‌హౌస్‌పై దాడి యత్నం చేసిన వారిపై కేసులు ఎందుకు పెట్టరు?

-హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలి: దేవి రవీందర్



గజ్వేల్:15 సెప్టెంబర్ (ప్రజా కలం ప్రతినిధి):

దళితులు, బీసీలు ,రైతులు, యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రైతుబంధు సమితి మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ ఆరోపించారు. ఇచ్చిన హామీలపై ప్రజలకు లెక్క చెప్పాలని, అమలు చేసే సత్తా లేకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలని డిమాండ్ చేశారు.గజ్వేల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చంద్రబాబు డైరెక్షన్‌లో తెలంగాణ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.

ఫామ్‌హౌస్ ఘటనపై కేసులు ఎందుకు లేవు?

బీఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడికి ప్రయత్నించిన వారిపై ఇప్పటివరకు కేసులు ఎందుకు నమోదు చేయలేదని దేవి రవీందర్ ప్రశ్నించారు. ఫామ్‌హౌస్ వద్దకు వచ్చి దాడికి ప్రయత్నిస్తే చట్టం ఎందుకు పనిచేయదని నిలదీశారు. ఘటన వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాన్ని ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.మంత్రి కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించాలనే డిమాండ్ల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ ఫామ్‌హౌస్ అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు.బిర్లా ఐలయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ, నర్సారెడ్డి తదితర నేతలు గజ్వేల్‌కు వచ్చి కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

దళితులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని దేవి రవీందర్ ప్రశ్నించారు. దళిత విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.20 లక్షల నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.రాజీవ్ యువ వికాస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న దళిత యువతకు రుణాలు ఎప్పుడు మంజూరు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.ఎస్సీ, బీసీ కార్పొరేషన్లకు అవసరమైన నిధులు కేటాయించడం లేదని,బీసీ బంధు అమలుపైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు.

కేసీఆర్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులు, బీసీలు, గొల్లకురుమలు, మత్స్యకారులు,రైతులు తదితర వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేశామని దేవి రవీందర్ పేర్కొన్నారు.దళిత బంధు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ వంటి కార్యక్రమాలను గుర్తు చేశారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం,నూతన సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం కేసీఆర్ పాలనలోనే జరిగాయని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు.“హామీలు అమలు చేయాలి.. రాజకీయాలు కాదు”“ ‘దళితుల పేరు చెప్పి రాజకీయాలు చేయడం కాదు.. వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి. బీసీల పేరు చెప్పి ఓట్లు అడగడం కాదు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలపై లెక్క చెప్పాలి” అని దేవి రవీందర్ డిమాండ్ చేశారు.“అచ్చ కాంగ్రెస్ పోయి.. పచ్చ కాంగ్రెస్ వచ్చింది” అంటూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.చంద్రబాబు డైరెక్షన్‌లో తెలంగాణలో వచ్చ రాజకీయాలు నడుపుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.దళిత స్పీకర్, దళిత ఉపముఖ్యమంత్రి అంటూ పదేపదే ప్రస్తావించడం కాదని,ఆయా వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన గౌరవమని అన్నారు. దళితులు,బీసీలు,రైతులు, యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.హామీల అమలులో విఫలమైన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని,హామీలు నెరవేర్చే సత్తా లేకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలని దేవి రవీందర్ డిమాండ్ చేశారు.రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు నావాజ్ మీరా,సీనియర్ నాయకులు నర్సింగారావు, రవీందర్,యూత్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు,కౌన్సిలర్ అత్తేల్లి శ్రీనివాస్,కోట బాబు,శ్రీధర్,గోలి సంతోష్, కప్ప పోచయ్య,అహ్మద్,శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రులు శాంతియుతంగా నిర్వహించాలి



డీజేలు,అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదు

నిమజ్జన సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

: గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

గజ్వేల్, సెప్టెంబర్ 16 (ప్రజా కలం ప్రతినిధి):

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, క్రమశిక్షణతో,సమన్వయంతో నిర్వహించాలని గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. బుధవారం గజ్వేల్‌లోని కోల అభిరామ్ ఫంక్షన్ హాల్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.సత్యనారాయణ సమన్వయంతో గణేష్ నవరాత్రుల శాంతి సమావేశం నిర్వహించారు.సమావేశానికి మున్సిపల్ ఛైర్పర్సన్ గంగిశెట్టి చందన, వైస్ ఛైర్పర్సన్ పద్మబాయ్ నర్సింగరావు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ ఏఈ,గణేష్ మండపాల నిర్వాహకులు, యువత తదితరులు కలిపి సుమారు 400 మంది హాజర య్యారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమాలకు మద్యం సేవించి హాజరు కాకూడదని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుం డా నిర్వాహకులు,యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టి,ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.

డీజేలకు అనుమతి లేదు


గణేష్ ఉత్సవాల్లో డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం,పోలీసు శాఖ నిర్దేశించిన శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని మండపాల నిర్వాహకులకు సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.సత్యనారాయణ కోరారు.నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా పోలీసు సిబ్బందికి నిర్వాహకులు, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ,ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.గణేష్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు

- బాలాపూర్ మహా గణనాథుడిని దర్శించుకున్న
- స్పీకర్ గడ్డం ప్రసాద్, కే ఎల్ ఆర్
- పూరి జగన్నాథ్ ఆలయాన్ని తలపిస్తున్న బాలాపూర్ గణపతి మండపం
- ఆకట్టుకున్న డెకరేషన్.. రైతుల కోసం మొక్కుకున్న కాంగ్రెస్ నేతలు



మహేశ్వరం, సెప్టెంబర్ 15, (ప్రజా కలం)

తెలంగాణలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన బాలాపూర్ మహా గణనాథుడిని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది బాలాపూర్ గణేష్ మండపాన్ని పూరి జగన్నాథ్ ఆలయ ఆకృతిలో అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆ మండపం ఆకృతి అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటోంది. స్పీకర్, కె ఎల్ ఆర్ మండప నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతన్నలు సంతోషంగా ఉండాలని బొజ్జ గణపయ్యను వేడుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని కోరుకున్నామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరాలని, ప్రతి ఒక్కరూ లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. తాను రైతుబిడ్డగా అన్నదాతలు బాగుండాలని ప్రత్యేకంగా మొక్కుకున్నానని కె ఎల్ ఆర్ తెలిపారు. అంతకుముందు మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జిల్లెలగూడ, మీర్‌పేట్, ప్రశాంతిహిల్స్, అల్మాస్‌గూడ డివిజన్లలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను కూడా స్పీకర్ గడ్డం ప్రసాద్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సొంత నిధులతో.. ప్రజాసేవ

- పదవి లేకున్నా ప్రజల్లో ఉండటమే నిజమైన నాయకత్వం..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 15 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రజల అవసరాలను గుర్తించి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడుతూ నందారం నరసింహా గౌడ్ ప్రజాసేవలో ప్రత్యేకత చాటుకున్నారు. బీరంగూడ డివిజన్ ఇక్రిశాట్ కాలనీ ఫేజ్–2లో ఆయన సొంత నిధులతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటూ సేవ చేయడమే నిజమైన నాయకత్వమన్నారు. కాలనీవాసుల అవసరాన్ని గుర్తించి కమ్యూనిటీ హాల్ నిర్మించడం అభినందనీయమన్నారు. శుభకార్యాలు, సమావేశాలు, పండుగలకు హాల్ ఉపయోగపడుతుందని తెలిపారు. నందారం నరసింహా గౌడ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కాలనీవాసుల కోరిక మేరకే హాల్ నిర్మించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ డివిజన్ సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానన్నారు. హాల్ అందుబాటులోకి రావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, యూనిస్, తలారి రాములు, నందారం రమేష్ గౌడ్, జగదీష్, దాస్ యాదవ్, ఇంద్రేశం జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాజ మల్లేష్, హర్షవర్ధన్ రెడ్డి, కనకరాజు, ఆకుల కృష్ణ, సందీప్ రెడ్డి, దీపక్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ప్రమోద్, జోహార్, కాలనీ సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు..



బాలాపూర్ భారీ గణనాథుడికి తొలి పూజ నిర్వహించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 15,(ప్రజా కలం)

ప్రతిష్టాత్మక బాలాపూర్ భారీ గణనాథుడి ప్రతిష్ఠాపన మహోత్సవంలో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. తన తనయుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తో కలిసి స్వామివారికి తొలి పూజ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ అంచెలంచెలుగా ఖ్యాతి పొంది ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బాలాపూర్ భారీ గణనాథుడి ప్రతిష్ఠాపనలో



పాల్గొని తొలి పూజలో భాగస్వామ్యం కావడం ఎన్నో జన్మల పుణ్యఫలమని అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులతో మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ గణనాథుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఏటా బాలాపూర్ గణనాథుడిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి, బాలాపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఒంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, గుండోజి రఘునందన్ చారి, చిగురింత పెద్ద నరసింహారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్ రెడ్డి, తిమ్మని గిరీష్, జూకంటి సురేష్ గౌడ్, కొప్పుల రాజు, మున్నా, అరవింద్ గౌడ్, సుమంత్ రెడ్డి, విజయ్, రిథన్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ సమితి సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

అహ్మద్‌నగర్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 15.



గ్రామంలో సబ్-ఇన్‌స్పెక్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాలు, బస్టాండ్ పరిసర ప్రాంతాలను డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

మహేశ్వరం మండలంలో అన్ని గ్రామాలలో ఆసరా పెన్షన్ల వెరిఫికేషన్

- వెరిఫికేషన్ కు వచ్చే అధికారులకు అవసరమైన పత్రాలతో సహకరించాలి - మహేశ్వరం ఎంపీడీవో శారదమ్మ

మహేశ్వరం, సెప్టెంబర్ 15,(ప్రజా కలం)

సెప్టెంబర్ 16 నుండి 25 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఆసరా పెన్షన్ల భౌతిక వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించబడుతుందని మహేశ్వరం



ఎంపీడీవో శారదమ్మ అన్నారు. ఈ వెరిఫికేషన్ వర్తించే పెన్షన్లు వితంతు పెన్షన్, దివ్యాంగుల పెన్షన్ ఒంటరి మహిళల పెన్షన్,కల్లు గీత, తాపీ కార్మికుల పెన్షన్ దారులు సరైన పత్రాలుతో అందుబాటులో ఉండాలని కోరారు. లబ్ధిదారులకు సూచనలు: కావున పైన తెలిపిన పెన్షన్ లబ్ధిదారులందరూ వెరిఫికేషన్ రోజున తప్పనిసరిగా తమ సొంత గ్రామంలో అందుబాటులో ఉండాలి. వెరిఫికేషన్ కు వచ్చే అధికారులకు ఆధార్ కార్డు, పెన్షన్ కార్డు వంటి అవసరమైన పత్రాలతో పూర్తిగా సహకరించగలరని కోరారు. వెరిఫికేషన్ కు హాజరు కాని వారి పెన్షన్ నిలిపివేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమాచారాన్ని అందరికీ తెలిపి అందరూ అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఎంపీడీవో కోరారు.

గణపతి నవరాత్రి పూజల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు ఎన్ సి సంతోష్

గజ్వేల్:15 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 15వ వార్డులోని ఎన్ సి ఆర్ ద్వారకా వెంచర్ లో కీర్తిశేషులు ఎన్ సి రాజయ్య పేరు మీద ఏర్పాటు చేసిన గణపతి మండపంలో కాలనీవాసుల ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటుచేసి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభించారు, గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని పూజించిన బిఆర్ఎస్ నాయకుడు ఎన్ సి సంతోష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్.సి.ఆర్ ద్వారక వెంచర్ లో ఏర్పాటుచేసిన గణపతి మండపం లో కాలనీవాసుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి స్వామివారి కరుణ కటాక్షాలు ఉంటాయని అన్నారు, ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాల జీపీఓ పై అవినీతి ఆరోపణలు

- జీపీఓ సుధాకర్‌పై అవినీతి ఆరోపణలు

- చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోకి వినతి

-ఆకన్‌పల్లి ఘట్టుపల్లి రైతులు, గ్రామస్థులు



మహేశ్వరం, సెప్టెంబర్ 15, (ప్రజా కలం)

మహేశ్వరం మండలం ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు, గ్రామస్థులు మహేశ్వరం తహశీల్దార్ చిన్నప్పలనాయుడు కి ఫిర్యాదు చేశారు. ఆకన్ పల్లి, ఘట్టుపల్లి గ్రామల జీపీఓ సుధాకర్‌పై లంచాలు తీసుకుంటున్నారంటూ ఆరోపణలు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. మహేశ్వరం మండల పరిధిలోని ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు రెవెన్యూ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. తమ భూ సమస్యలను పరిష్కరించేందుకు జీపీఓ సుధాకర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ పనుల కోసం అధికారులను ఆశ్రయిస్తున్న ప్రజలు లంచాలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అధికారులు తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. జీపీఓ సుధాకర్ కు నగదు చెల్లించినట్లు పేర్కొంటూ రైతులు పలు మొత్తాలను వెల్లడించారు. ఒక్కో రైతు రూ. 10 వేలు, రూ. 10 వేలు, రూ. 6 వేలు, రూ. 5 వేలు, రూ. 500తో పాటు రూ. 30 వేల నగదును చెల్లించినట్లు వివరించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, జీపీఓ పై చర్యలు తీసుకోని తక్షణమే విధుల నుండి తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆకన్‌పల్లి, గట్టుపల్లి గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణపై కూడా అధికారులు దృష్టి సారించాలని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘట్టుపల్లి సర్వే నంబర్లు 64, 65లోని ప్రభుత్వ భూముల విషయంలో అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపించారు. సర్వే నంబర్లు 64, 65 పరిధిలో మొత్తం 296 ఎకరాల 8 గుంటల భూమి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని, జీపీఓ సుధాకర్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించి తక్షణమే విధుల నుండి తొలగించాలని గ్రామస్థులు కోరారు. రైతులకు, ప్రజలకు రెవెన్యూ సేవలు నక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో కి రైతులు విజ్ఞప్తి చేశారు.

మహేశ్వరం నుంచి ఫ్యూచర్ సిటీకి భారీ ర్యాలీ

- సెప్టెంబర్ 17న ఫ్యూచర్ సిటీ కమిషనర్‌కు వినతిపత్రం

- ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేందుకు సానుకూలంగా స్పందించిన కేఎల్ఆర్‌కు కృతజ్ఞతలు - జేపీసీ చైర్మన్ వత్తుల రఘుపతి



మహేశ్వరం, సెప్టెంబర్ 15 (ప్రజా కలం) :

మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని కోరుతూ సెప్టెంబర్ 17న మహేశ్వరం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి తెలిపారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు మహేశ్వరం మండల కేంద్రానికి చేరుకుని, అక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు ర్యాలీగా వెళ్లి ఫ్యూచర్ సిటీ కమిషనర్ శశాంక్‌కు (ఎఫ్‌సీడీఏ) వినతిపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన విషయాన్ని రఘుపతి గుర్తు చేశారు. గ్రామాల విలీనానికి కేఎల్ఆర్ సానుకూలంగా స్పందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లు తీర్మానాలు ఇస్తారని ఎదురుచూశామని, వారు తీర్మానాలు ఇచ్చినా ఇవ్వకపోయినా మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తామని కేఎల్ఆర్ ప్రకటించారని రఘుపతి తెలిపారు. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ జేఏసీ ఇంతకుముందు ప్రకటించిన సెప్టెంబర్ 17న ఫ్యూచర్ సిటీ ముట్టడి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలన్న ప్రజల ఆకాంక్షకు కేఎల్ఆర్ సానుకూలంగా స్పందించినందుకు జేఏసీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంశంపై తదుపరి చర్యల్లో భాగంగా సెప్టెంబర్ 17న మహేశ్వరం మండల కేంద్రం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు ర్యాలీ నిర్వహించి, కేఎల్ఆర్ ఆధ్వర్యంలో ఫ్యూచర్ సిటీ కమిషనర్ శశాంక్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వత్తుల రఘువతి పిలుపునిచ్చారు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా రేషన్ కార్డుల పంపిణీ

రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 15, (ప్రజా కలం)

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈరోజు డిజిటల్ (స్మార్ట్) రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై, లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సుమారు 1,23,000 పాత రేషన్ కార్డులను ప్రభుత్వం అత్యాధునిక డిజిటల్ స్మార్ట్ కార్డులుగా మార్చి అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డులు లేని అర్హులైన పేదల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని, దీని ద్వారా నియోజకవర్గంలో కొత్తగా సుమారు 60 వేల మందికి రేషన్ కార్డులో సభ్యులుగా నమోదయ్యే అవకాశం వచ్చిందని, ఇది చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ సరుకులు మరింత పారదర్శకంగా అందాలనే ఉద్దేశంతోనే ఈ స్మార్ట్ కార్డుల జారీ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు, పౌరసరఫరాల శాఖ అధికారి పుల్లయ్య, గండిపేట్, శంషాబాద్ రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.



శ్రీ వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు

మాజీ అధ్యక్షులు, యూత్ పెద్దలకు ఘన సన్మానం భక్తిశ్రద్ధలతో మొదటి రోజు పూజలు

మహేశ్వరం, సెప్టెంబర్ 15,(ప్రజా కలం):

మహేశ్వరం మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఉదయం గణనాథుడికి ప్రత్యేక అలంకరణ చేసి, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు, పాలాభిషేకం, అష్టోత్తర పూజ నిర్వహించారు. యువజన సంఘం సభ్యులందరూ పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. జై బోలో గణేష్ మహరాజ్ కీ జై నినాదాలతో, భక్తి కోలాహలంతో మండపం మారుమోగింది. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి, గ్రామంలో భక్తి కార్యక్రమాల నిర్వహణకు ఎంతో కృషి చేసిన యువజన సంఘం మాజీ అధ్యక్షులను, యూత్ పెద్దలను ఘనంగా సన్మానించారు. సంఘ ప్రస్తుత అధ్యక్షులు, ఉపాధ్యక్షుల చేతుల మీదుగా వారికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలు 9 రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతాయని, ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నాదర్‌గుల్ లో పర్యావరణ స్పృహ

- మట్టి వినాయకుల పంపిణీ

- మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్

మహేశ్వరం, సెప్టెంబర్ 15,(ప్రజా కలం)

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాదర్‌గుల్ గ్రామంలోని వివేకానంద యూత్ పెద్ద గణేష్ మండపం వద్ద భక్తులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ నిమ్మల



సునీత శ్రీకాంత్ గౌడ్ కృషితో, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జక్కిడి ఉపేందర్ రెడ్డి, వివేకానంద యూత్ అధ్యక్షుడు తోట సంతోష్ రెడ్డి, మహంకాళి అమ్మవారి ఆలయ అధ్యక్షుడు యాతం యాదయ్య యాదవ్ ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పర్యావరణాన్ని రక్షిద్దాం.. మట్టి గణపతిని పూజిద్దాం అనే నినాదంతో భక్తులకు మట్టి వినాయకులను అందజేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్ సభ్యులతో పాటు పాలుబాయ్ లక్ష్మణ్, యాలాల ధన్ పాల్ రెడ్డి, పాల్ బాయ్ చందు, చెగురి అమరేందర్ రెడ్డి, ఏనుగు రఘుమ రెడ్డి, ఏనుగు అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల చెరువులు కలుషితమవుతున్నాయని, అందరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యం.

సాగు ఖర్చులు తగ్గుతాయి.. నేల సారం పెరుగుతుంది: జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి.

దుబ్బాక ప్రజాకలం ప్రతినిధి 15:రాయపోల్ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంపై రైతులకు అవగాహన కల్పించి, ఫార్మర్స్ కిట్లను పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేందర్ మోహన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి రైతులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యం, నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడి, దీర్ఘకాలంలో స్థిరమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి స్థానిక వనరులతో సహజ పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు. జీవామృతం, బీజామృతం, నిమాస్త్రం, అగ్నియాస్త్రం, బ్రహ్మాస్త్రం తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం బోనస్ అందిస్తున్న ఏడు వరి సన్న రకాల సాగు రైతులు ఈ నెల 17లోపు విత్తన డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలని, సొంత విత్తనాలతో సాగు చేసిన వారు స్వీయ ధ్రువీకరణ ద్వారా వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. డిజిటల్ క్రాప్ బుకింగ్ జరుగుతున్నందున రైతులందరూ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, సర్పంచ్ దివ్య కృష్ణ, ఏఎంసీ/ఆత్మ డైరెక్టర్లు మల్లేష్, జాని గౌడ్, ఏఈఓలు రజిత, శిరీష, రైతులు పాల్గొన్నారు.



బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

బీబీనగర్ సెప్టెంబర్ 15 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా,బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ మంగళవారం రోజున ఆకస్మికంగా సందర్శించి,పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు,కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ పరిసరాలు,సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను తనిఖీ చేసి,రికార్డుల



నిర్వహణలో క్రమశిక్షణ,కేసుల దర్యాప్తులో నాణ్యత,పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం,ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన వంటి అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఎస్పీ నేరుగా మాట్లాడి ప్రతి ఒక్కరి విధులు బాధ్యతలు,రోజువారీ కార్యాచరణ గురించి అడిగి తెలుసుకున్నారు.విధి నిర్వహణలో అప్రమత్తత, సమన్వయం, బాధ్యతాయుతమైన పనితీరు, ప్రజల పట్ల మర్యాదపూర్వక వైఖరిని పాటించాలని సూచించారు.అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా,క్రమబద్ధంగా ఉంచడంతో పాటు, ప్రజలకు మరింత మెరుగైన పోలీసింగ్ సేవలు అందించేలా ప్రతి అధికారి,సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీ సందర్భంగా బీబీనగర్ ఎస్‌హెచ్‌ఓ ప్రభాకర్ రెడ్డి,పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం

బొమ్మలరామారం, సెప్టెంబర్ 15 (ప్రజా కలం)

ప్రజల సమస్యలను జిల్లాలోని మండల వారీగా పరిష్కరించే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మండలంలోని సోమవారం రోజున నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన రెవిన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం బొమ్మలరామారం మండల తాహసిల్దార్ పి.రాధకు మంగళవారం




రోజున వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజున నిర్వహించే ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదులు చేసిన ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా రెవిన్యూ అధికారులు తగు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని మండల తాహసిల్దార్ పి.రాధ కు వినతి పత్రం అందజేయడం జరిగిందని అన్నారు రైతులు ఫిర్యాదులు చేసుకుని చాలా రోజులు అవుతున్న మండల రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని అన్నారు గత మూడు వారాలుగా ప్రజావాణిలో ఇచ్చిన రెవిన్యూ ఫిర్యాదులు పెండింగులో ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు పరిష్కరించని యెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు,పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు దేవేందర్,రమేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు

రావిరాల జన్నెగూడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకలు

మహేశ్వరం, సెప్టెంబర్ 15,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామం జన్నెగూడ క్షేత్రగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వినాయకుని మొదటి రోజు పూజను ఘనంగా నిర్వహించారు. డెవలప్మెంట్ కమిటీ భక్తుల సహకారంతో ఈ పూజా కార్యక్రమం జరిగింది. విఘ్నేశ్వరుని మొదటి రోజు పూజను ఏర్కలి సహదేవ్ గౌడ్ – అర్చన దంపతులు చేయించారు.పూజ చేయించిన దంపతులపై విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని డెవలప్మెంట్ కమిటీ తరపున ఆకాంక్షించారు.ఈ పూజా కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ మాజీ చైర్మన్ గోనెమోని శివశంకర్, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పిట్టల శ్రీశైలం, ఉప్పునూతల యాదయ్య, వలోజు లాలయ్య, కాల్వ రమేష్, కందికంటి బాబు సాయి పంతులు అజయ్ తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేకే ప్రతిపక్షాల బురదజల్లే ప్రయత్నాలు

భూమి లావాదేవీలతో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదు: కాంగ్రెస్ నేతలు, పట్టాదారులు



బొమ్మలరామారం, సెప్టెంబరు 15 (ప్రజాకలం):

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సింగిల్‌విండో చైర్మన్ ధీరావత్ శంకర్‌నాయక్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షాడ భాస్కర్‌రెడ్డి, రాజారాం నాయక్ అన్నారు. మంగళవారం బొమ్మలరామారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

రాజకీయంగా ఎదుర్కోలేక ఆరోపణలు

బీసీ బిడ్డగా ఎదుగుతున్న బీర్ల ఐలయ్యను ఓర్వలేక కొందరు విషప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆలేరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రతిపక్షాలు అసూయతో ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఆలేరు ప్రజల గుండెల్లో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు స్థానం చెక్కుచెదరదని పేర్కొన్నారు.

భూమి వ్యాపారంతో ఎమ్మెల్యేకు సంబంధం లేదు

తాము గత 20 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నామని, ఎవరు అధికారంలో ఉన్నా.. లేకపోయినా భూముల వ్యాపారం కొనసాగిస్తున్నామని శంకర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, రాజారాం నాయక్ తెలిపారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో సన్నిహితంగా ఉండటంతో పాటు పార్టీలో వదవులు పొందినంత మాత్రాన తాము చేస్తున్న భూముల వ్యాపారంతో ఎమ్మెల్యేకు సంబంధం ఉందని ఆరోపించడం సరికాదన్నారు. బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్–బొమ్మలరామారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 76, 78, 142, 143లో ఉన్న 14 ఎకరాల 26 గుంటల భూమిని అసలు పట్టాదారు ఎర్వ శశికాంత్‌రెడ్డి వద్ద నుంచి చట్టబద్ధమైన పత్రాలను పరిశీలించి కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. ఈ లావాదేవీలతో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

పత్రాలతో రావాలి

భూమి వ్యవహారంపై ఆరోపణలు చేస్తున్న వారు తమ వద్ద ఉన్న పత్రాలతో ముందుకు రావాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ చేశారు. తాము అసలు పట్టాదారులతో పాటు భూమికి సంబంధించిన పత్రాలను ప్రజల ముందుంచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాజకీయంగా తమ వ్యాపారానికి ఇబ్బందులు కలిగించడంతో పాటు ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

ఆర్థిక అవసరాల కోసమే భూమి విక్రయం

భూమి అసలు పట్టాదారు ఎర్వ శశికాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ ఆర్థిక అవసరాల కోసం భూమిని శంకర్‌నాయక్, షాడ భాస్కర్‌రెడ్డి, రాజారాం నాయక్‌లకు విక్రయించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఈ భూమితో ఎలాంటి సంబంధం లేదన్నారు.

కొందరు రాజకీయంగా తమను ఇబ్బందులకు గురిచేస్తూ భూమిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తామే అసలు పట్టాదారులమని, ఈ వ్యవహారంలో హైకోర్టులోనూ తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని శశికాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

నాదర్గుల్ బస్టాండ్ గణేష్ మండపంలో ఘనంగా పూజలు

– రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా ఉండాలి

– విఘ్నేశ్వరునికి లక్ష రూపాయల విరాళం అందజేసిన చెరుకుపల్లి వెంకటరెడ్డి



మహేశ్వరం, సెప్టెంబర్ 15,(ప్రజా కలం)

రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని బీజేపీ నాయకులు చెరుకుపల్లి వెంకటరెడ్డి అన్నారు.వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాదర్గుల్ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయక ఉత్సవ సమితి ప్రతిష్టించిన విఘ్నేశ్వరునికి చెరుకుపల్లి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయక విగ్రహ ప్రతిష్టాపనకు లిరూ. 1,00,000/- విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాల క్రితం కూడా వినాయక విగ్రహానికి విరాళాలు అందించడం జరిగిందని, అలాగే గతంలో విఘ్నేశ్వరుని లడ్డూ ప్రసాదం రెండు పర్యాయాలు తమ కుటుంబానికి దక్కడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు, యావత్ తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషా లతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు, దీవెనలు, కరుణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షులు జక్కిడి ఉపేందర్ రెడ్డి, మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ యాతం యాదయ్య , వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు తోట సంతోష్ రెడ్డి, నిమ్మల శ్రీకాంత్ గౌడ్, పాలుబాయ్ లక్ష్మణ్, ఏనుగు మోహన్ రెడ్డి, గూడూరు చంద్రశేఖర్ రెడ్డి, ఏనుగు వెంకట్ రెడ్డి, పెత్తుల పుల్లారెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చిన దాత

ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు కందకట్ల సిద్ధురెడ్డి సొంత ఖర్చులతో మౌలిక వసతులు కల్పిస్తానని హామీ

విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో హర్షం

శంషాబాద్, సెప్టెంబర్ 15, (ప్రజా కలం):

సమాజ సేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు కందకట్ల సిద్ధురెడ్డి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చారు.శంషాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. పాఠశాలకు విచ్చేసిన సిద్ధురెడ్డికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛంతో సత్కరించారు.అనంతరం ఆయన పాఠశాల ఆవరణ, భవనం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, మధ్యాహ్న భోజన పథకం, ఆట స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న





ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కందకట్ల సిద్ధురెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శంషాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను త్వరలోనే తన సొంత ఖర్చులతో కల్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమానికి, వారి ఉన్నత చదువులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు.సిద్ధురెడ్డి ఇచ్చిన హామీ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో కూడా అనేక సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, విద్యార్థులకు సహాయ కార్యక్రమాలు చేపట్టిన సిద్ధురెడ్డి సేవలను పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో వైభవంగా "విపస్సి ధ్యాన కేంద్రం" ప్రారంభం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 15:

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లోని మోక్షానంద బుద్ధ విహార్ (ఎంబివి) లో ఆదివారం "విపస్సి ధ్యాన కేంద్రం" ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ చారిత్రాత్మక వేడుకలో భాగంగా సంఘపాల బంతే చేతుల మీదుగా ధమ్మ ధ్వజారోహణ, బుద్ధపాల బంతే ఆధ్వర్యంలో బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఈ బుద్ధ విగ్రహాన్ని ప్రముఖ దాత డాక్టర్ పాకాల మమత సమర్పించారు.

కార్యక్రమం ప్రారంభంలో విగ్రహ ప్రతిష్టాపన ప్రార్థన, త్రిషరణం, పంచశీలాలను పఠించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి విచ్చేసిన అతిథులు చెన్నూరి ఆంజనేయ రెడ్డి, కె.కె రాజు, గౌతం ప్రసాద్ బౌద్ధ సంస్కృతిపై ప్రత్యేక ఉపన్యాసాలు చేశారు.అనంతరం ఎంబీవీ చీఫ్, త్రిపిటక అనువాదకులు బంతే ధమ్మరక్షిత ఉపాసకులకు చక్కగా బోధించాడు గౌతమ బుద్ధుడికి ఉన్న అనేక నామాలలో 'విపస్సి' ఒకటని పేర్కొన్నారు. మనస్సు పాదరసం లాంటిదని, దానిని అదుపులో ఉంచి స్థిరత్వం చేకూర్చడానికి ధ్యానం ఎంతో అవసరమని వివరించారు. మనిషి ఎప్పుడూ వర్తమానంలో జీవించాలని, ఆలోచనకు తగ్గట్టుగానే పనులు చేయాలని బుద్ధుడు ప్రబోధించారని గుర్తుచేశారు. బౌద్ధంలోని దానం, శీలం, భావన అనే మూడు ముఖ్యాంశాలపై ఉపాసకులకు ఆయన స్పష్టమైన అవగాహన కల్పించారు. "ధ్యానం చేస్తేనే జ్ఞానం సిద్ధిస్తుంది.. ధ్యానం విస్మరిస్తే జ్ఞానం నశిస్తుంది" అని బుద్ధుని సూక్తులను బంతే స్పష్టం చేశారు.ఈ మహోత్సవానికి స్థానిక ప్రజలతో పాటు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, ముంబై తదితర ప్రాంతాల నుంచి బౌద్ధ ఉపాసకులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

మోర్తాడ్ లో ఘనంగా మహిళా సదస్సు: హాజరైన మంత్రి సీతక్క

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)సెప్టెంబర్ 15::

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండల



కేంద్రంలో మంగళవారం భారీ మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మహిళలతో ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు మహిళలకు ఏ మేరకు అందుతున్నాయి, వాటి ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలపై ఆమె సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలతో మహిళా సాధికారతకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, మరియు స్థానిక ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

ప్లాస్టిక్ రహిత గ్రామం వైపు అక్కూర్ అడుగులు

గ్రామ పంచాయతీ, వీడీసీ ఆధ్వర్యంలో స్టీల్ సామాగ్రి పంపిణీ

సర్పంచ్ జిన్నా జనార్దన్ పిలుపు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 15:

వేల్పూర్ మండలంలోని అక్కూర్ గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో అక్కూర్ గ్రామ పంచాయతీ, విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనే ధ్యేయంగా గ్రామస్తులకు పర్యావరణహితమైన స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జిన్నా జనార్దన్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత, ఆరోగ్యకరమైన అక్కూర్ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, ఇస్తరాకుల వాడకాన్ని నిలిపివేయాలని కోరారు. ఇకపై గ్రామంలో జరిగే ఎలాంటి శుభకార్యాలు, సమావేశాలు, పండుగలలోనైనా కేవలం స్టీల్ సామాగ్రిని మాత్రమే వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీడీసీ ప్రెసిడెంట్ సంజీవ్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దమనుషులు, యువతీ యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.





పాలెంలో ఘనంగా ప్రేమ జంట వివాహ రిసెప్షన్

భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుకరించిన అంబేడ్కరైట్ శ్రేయోభిలాషులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 15:

ప్రేమ వివాహాలు సమాజ అభివృద్ధికి అత్యవసరమని, కులం మరియు ఆస్తి కంటే మనసుల కలయిక, వ్యక్తిత్వమే ముఖ్యమని ముంబైకి చెందిన అంబేద్కరైట్ మేధావి, మూలనివాసి మాలజీ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన ఆరే అరుణ్, ప్రీతి ల ప్రేమ వివాహం గత ఆగస్టు 24న జరగగా, వారి వివాహ రిసెప్షన్ వేడుక ఆదివారం స్థానిక గ్రామంలో అత్యంత వైభవంగా జరిగింది.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాలజీ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిలో పక్షుల వలె తమ జీవిత భాగస్వామిని తామే ఎంచుకునే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉండాలన్నారు.

సమాజంలో ఉన్న మూఢాచారాలను రూపుమాపడానికి ప్రేమ వివాహాలు ఎంతో దోహదపడతాయని, ప్రతి వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని సమాజం గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రిసెప్షన్ వేడుకలో ఇరుపక్షాల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఎంతో సంతోషంగా పాల్గొని నూతన వధూవరులు జీవితాంతం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దీవించారు. కాగా, గ్రామానికి చెందిన అంబేద్కరైట్ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు నూతన దంపతులకు భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుమతిగా అందించి, తమ వినూత్న శుభాకాంక్షలను తెలియజేయడం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కుకునూరు ఉన్నత పాఠశాలను పరిశీలించిన జిల్లా ప్యానల్ బృందం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 15:

వేల్పూర్ మండలంలోని కుకునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం విద్యాశాఖకు చెందిన జిల్లా ప్యానల్ బృందం సందర్శించింది. పాఠశాల ప్రార్థన సమయానికి చేరుకున్న అధికారులు.. సాయంత్రం వరకు అక్కడే ఉండి సమగ్ర పరిశీలన జరిపారు. సోషల్ నోడల్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్యానల్ సభ్యులు చిన్నయ్య (ఇంగ్లీష్), గంట అశోక్ (గణితం), కోకిల నాగరాజు (తెలుగు), రమేష్ (సైన్స్), గంగాధర్ (హిందీ)లు తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయుల బోధనా తీరును గమనించారు.

విద్యార్థులు రాసిన పుస్తక సమీక్షలు, రాత అంశాలు, ప్రాజెక్టు పనులు, లఘు పరీక్షల రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధనా విధానంపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రారంభ పరీక్షలు, అకడమిక్ రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ఫిజికల్ డైరెక్టర్ గంగాధర్ విద్యార్థులతో వాలీబాల్ ఆడించి, క్రీడా నైపుణ్యాలపై తగిన సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. హరిచరణ్, ఉపాధ్యాయులు డాక్టర్ పతాని గంగాధర్, శ్రీధర్ రావు, నాగరాజు, చరణ్ దాస్, మల్కన్నా, రవీందర్, హరిత తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ..

సీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు



నిజామాబాద్, సెప్టెంబర్ 15:
(ప్రజా కలం ప్రతినిధి)

సీపీఐ మావోయిస్టు సీనియర్ అండర్ గ్రౌండ్ క్యాడర్ డివిజన్ కమిటీ సభ్యురాలు పోలీసుల ఎదుట లొంగిపోయింది. మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. సీపీఐ మావోయిస్టు సీనియర్ అండర్ గ్రౌండ్ క్యాడర్ డివిజన్ కమిటీ సభ్యురాలు పోలీసుల ఎదుట లొంగిపోయింది.

జనజీవన స్రవంతిలో..

మావోయిస్టు కమిటీ సభ్యురాలు నక్క సుశీల అలియాస్ రాణి అలియాస్ లత లలిత రేలా జ్యోతి అలియాస్ మాధవి అలియాస్ శ్వేత నిజామాబాద్ పోలీసుల సమక్షంలో లొంగిపోయారు.

ఈ మేరకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మంగళవారం మీడియా సమక్షంలో వివరాలు వెల్లడించారు. మావోయిస్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ కమిటీ సభ్యురాలు, డీవీసీ ఛత్తీస్‌గడ్ ఏరియా సభ్యురాలైన నక్క సుశీల బోధన్లోని శంకర్ నగర్ కాగా.. ఆమె తండ్రి నిజాం షుగర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్గా పనిచేసేవారు. అక్టోబర్ 2005లో ఆయన గుండెపోటుతో మరణించారు.

సుశీల చిన్నప్పుడే తల్లి కమల అనారోగ్యంతో మృతి చెందింది. సుశీల 1985లో హైదరాబాద్లోని నారాయణగూడలో మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశారు. 1985 నుంచి 1987 వరకు, ఇంటర్మీడియట్ అలాగే 1987 నుంచి 1990 వరకు డిగ్రీ విద్యను హైదరాబాద్లోని నాంపల్లి ఉన్నత విద్య వనిత జూనియర్ కాలేజీలో డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం బీఈడీ కూడా చేశారు.

అనంతరం మావోయిస్టుగా..

హైదరాబాద్ లో డిగ్రీ చదువుతున్న సమయంలో ఆమెకు బంధువైన నుచేంద్ర ద్వారా దివంగత రామ్మోహన్రావు పరిచయమయ్యారు. ఆయన సీపీఐ ఎంఎల్ పీడబ్ల్యూ సిద్ధాంతాలు కలిగి ఉండడంతో సుశీల ఆకర్షితురాలైంది. ఆమె 1990లో నల్గొండ జిల్లా కమిటీ ఏసీఎం అయిన సుంకర రామ్మోహన్రావును వివాహం చేసుకున్నారు.

అనంతరం ఫిబ్రవరి 1992లో సీపీఐఎంఎల్ పీడబ్ల్యులో చేరారు. 2001లో నల్లమల అడవిలో జరిగిన ఎదురు కాల్పుల్లో రామ్మోహన్ రావు మరణించారు. ఆ తర్వాత 2004లో ఆమె ఎస్సీఎం సామలును వివాహం చేసుకున్నారు. ఛత్తీస్ గడ్ అటవీప్రాంతంలో 2006లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆయన మరణించారు. అయితే తెలంగాణకు చెందిన అజ్ఞాత మావోయిస్టు కార్యకర్తలు అందరూ జనజీవన స్రవంతిలో చేరాలని ప్రభుత్వం చేసిన సూచన మేరకు నక్క సుశీల సైతం జనజీవన స్రవంతిలో కలిసినట్లు సీపీ వెల్లడించారు.

ఖమ్మంలో రెండో దశ అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

రెండు నెలలుగా నిరీక్షిస్తున్న 400 మంది జర్నలిస్టులు

మొదటి దశలో 800 మందికి కార్డుల జారీ..

అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు



ఖమ్మం, సెప్టెంబరు 15 (ప్రజాకలం):

ఖమ్మం జిల్లాలో రెండో దశ అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియపై జర్నలిస్టుల్లో ఉత్కంఠ నెలకొంది. మొదటి దశలో సుమారు 800 మంది జర్నలిస్టులకు కార్డులు జారీ చేసినప్పటికీ.. రెండో దశ కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 400 మంది ఇంకా ఎదురుచూస్తున్నారు. రెండు నెలలు గడుస్తున్నా కార్డుల జారీపై స్పష్టత లేకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పుడు జారీ చేస్తారో..?

జిల్లాలో అర్హతలు ఉన్నప్పటికీ రెండో దశ అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు ఇప్పటివరకు కార్డులు అందలేదు. తమ దరఖాస్తుల పరిశీలన పూర్తయిందా? జారీ ప్రక్రియ ఏ దశలో ఉంది? ఇంకా ఎంత సమయం పడుతుంది? అనే విషయాలపై స్పష్టత లేకపోవడంతో వారు అధికారుల స్పందన కోసం నిరీక్షిస్తున్నారు.

ఎవరి వద్ద ఆగింది?

అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం మధ్య సమన్వ యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కమిటీ సమావేశం నిర్వహణలో జాప్యమా? అధికారుల స్థాయిలో నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, కార్డుల జారీ ఆలస్యానికి అసలు కారణం ఏమిటనే దానిపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

అధికారుల స్పందన కోసం..

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. అలాంటి వారి వృత్తిపరమైన గుర్తింపునకు సంబంధించిన అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో జాప్యం జరగడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే జర్నలిస్టులు కార్డుల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి రెండో దశ అక్రిడిటేషన్ కార్డుల జారీపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని నిరీక్షిస్తున్న జర్నలిస్టులు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే విషయాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల నివారణకు ప్రత్యేక సమీక్ష

గర్భిణులు, నవజాత శిశువులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు

గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 15 (ప్రజాకలం): జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఐడీఓసీ కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన చిన్నారుల మరణాల కేసులను సమగ్రంగా పరిశీలించి.. వాటికి దారితీసిన కారణాలపై విశ్లేషణ చేశారు.

గర్భిణులు, శిశువులపై ప్రత్యేక దృష్టి

గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని, ప్రమాదకర గర్భధారణలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించాలని అధికారులు సూచించారు. ప్రసవానంతరం తల్లి, శిశువుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. నవజాత శిశువులకు అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనారోగ్య లక్షణాలను ముందే గుర్తించాలి

చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే గుర్తించి, అవసరమైన వైద్యం కోసం ఉన్నతస్థాయి ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సీహెచ్ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెచ్ఈలు సమన్వయంతో పనిచేసి శిశు మరణాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు.

అధికారులు, వైద్య సిబ్బంది హాజరు

సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. కె. రామకృష్ణ, పీఓ--సీహెచ్ఐ డా. కె. రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. కవిత, పీడియాట్రిక్స్ హెచ్ఓడీ డా. హబీబ్ అలీ, గైనకాలజీ హెచ్ఓడీ డా. శీలాపాణి, అనస్థీషియా హెచ్ఓడీ డా. కరుణ్ రెడ్డి, ఎస్‌డీసీయూ నోడల్ అధికారి, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

- తెలంగాణ విమోచన దిన ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్





హైదరాబాద్, సెప్టెంబరు 15, (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పలువురు ప్రముఖులు డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయడంతో పాటు,అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలయ్ బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, బండారు విజయలక్ష్మి నేతృత్వంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'తెలంగాణ విమోచన దినాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు కోదండరామ్,అంజిరెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీఎస్ రాములు, పాశం యాదగిరి, పాదూరి కరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని అన్నారు.నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న అణచివేత, దోపిడీ, హింసను, కాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల దమనకాండను ఆయన ప్రస్తావించారు. అప్పటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో భారత సైన్యం చేపట్టిన చర్యల అనంతరం నిజాం పాలనకు ముగింపు పలికి తెలంగాణ ప్రాంతం భారత సామ్యంలో విలీనమైందని తెలిపారు. విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సీహెచ్. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ విమోచన చరిత్రను రాజకీయాలకు అతీతంగా భావితరాలకు తెలియజేయాలని అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న సమయంలో బైరాన్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తుచేస్తూ, రజాకార్ల దమనకాండకు బైరాన్‌పల్లి ఘటన విషాద సాక్ష్యంగా నిలిచిందన్నారు. విమోచన పోరాటానికి సంబంధించిన చారిత్రక ఆధారాలను వెలికితీసి, యువతకు వాస్తవ చరిత్రను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఇతర వక్తలు మాట్లాడుతూ కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో చారిత్రక విలీన ఘట్టాలను అధికారికంగా నిర్వహిస్తున్న తరహాలోనే తెలంగాణలోనూ సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. చారిత్రక ఆధారాల సేకరణ, పరిశోధనలను ప్రోత్సహించడంతో పాటు పాఠ్యాంశాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విమోచన పోరాట చరిత్రను భావితరాలకు చేరవేయాలని సూచించారు. సెప్టెంబర్ 17ను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించి, తెలంగాణ విమోచన పోరాట అమరవీరులకు సముచిత గౌరవం కల్పించాలని రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ సమాజానికి, దళితులకు

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

: బల్మూరి వెంకట్



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజా కలం ప్రతినిధి) :

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'కేటీఆర్ కంటే ఎక్కువ తిట్లు తిట్టగలం.. కానీ తల్లిదండ్రులు మాకు విజ్ఞత నేర్పించారు. కేటీఆర్ ప్రవర్తనను చూసి సిగ్గనిపిస్తోంది. ఒక కులానికి మచ్చ తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన చేసిన తప్పుకు కులం అంతా తల దించుకుంటోంది' అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీగా తయారైందని విమర్శించారు. అసెంబ్లీ ప్రాంగణంలో కేటీఆర్ పీఏ, పీఆర్వో ప్రవర్తన అత్యంత దారుణంగా ఉందన్నారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ఎలాంటి భాష ఉపయోగించారో.. కేటీఆర్ పీఏ, పీఆర్వో కూడా అలాగే మాట్లాడారని వెంకట్ మండిపడ్డారు. ఇంకా తామే అధికారంలో ఉన్నామని.. కేటీఆర్ రాష్ట్రానికి యువరాజు అన్నట్లుగా వీళ్ల తీరు ఉందంటూ ఫైర్ అయ్యారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో దాడి జరిగిందని కేటీఆర్, హరీశ్ రావు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ పీఏ, పీఆర్వోపై ఎలాంటి దాడి జరగలేదని పోలీసు ఉన్నతాధికారులు తేల్చి చెప్పారని తెలిపారు. గణేశ్ మండపం డీజే అనుమతి కోసమే కొందరు యువకులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారని చెప్పారు. కేటీఆర్ పీఏ, పీఆర్వోల గురించి ఎవరికీ తెలియదన్నారు. తాతా మధుతో పాటు చివరకు కేటీఆర్ పీఏ, పీఆర్వోలు కూడా పోలీసులను దూషిస్తున్నారంటే వాళ్ల ప్రవర్తనను అర్థం చేసుకోవచ్చని వెంకట్ అన్నారు. పదేళ్లు ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఏనాడూ తాము ఇలాంటి భాష, ఇలాంటి ప్రవర్తన చేయలేదని చెప్పుకొచ్చారు. పోలీసులు తమ డ్యూటీ చేస్తున్నారన్నారు. మీడియాలో కనిపించాలన్న ఆరాటంతోనే బీఆర్ఎస్ నాయకులు హడావుడి చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇందుకోసం ఏ అఘాయిత్యమైనా చేస్తామన్నట్లుగా వారి తీరు ఉందంటూ మండిపడ్డారు. కేటీఆర్ పీఆర్వో పోలీసులపై చెప్పరాని భాషలో దూషణలు చేశారన్నారు. కేటీఆర్ ఇప్పటికైనా ప్రవర్తన మార్చుకోవాలని హితవుపలికారు. తెలంగాణ సమాజానికి, దళితులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'నీ పీఏ, పీఆర్వోలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి. లేకుంటే పోలీసులు తమ పని తాము చేసుకుంటూ పోతారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నా పక్కటెముకలు విరిగిపోయాయి. అయినా ఏనాడూ పోలీసులపై నేను దూషణలు చేయలేదు' అని బల్మూరి వెంకట్ పేర్కొన్నారు.

కూల్చిన చోటే నిర్మాణం.. మున్సిపాలిటీ నిద్రలో..!



- 5 అంతస్తులకు అనుమతులు ఎవరిచ్చారు?

- సెట్‌బ్యాక్‌పై అధికారులకే తెలియదా?..

- కూల్చివేత తర్వాత మళ్లీ నిర్మాణం ఎలా?..

-కమిషనర్‌దీ నాకు తెలియదు ధోరణేనా?..

- అనుమతుల వెనుక అసలు కథేంటి?..



పటాన్‌చెరు, సెప్టెంబర్ 15 (ప్రజా కలం ప్రతినిధి)

ఇంద్రేశం పురపాలక సంఘం పరిధిలో అక్రమ నిర్మాణాల భాగోతం రోజు రోజుకూ మరింత సంచలనంగా మారుతోంది. అనుమతులకు విరుద్ధంగా, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం జరుగుతుం దన్న ఆరోపణల నేపథ్యంలో గతంలో అధికారుల ఆదేశాల మేరకు, వారి సమక్షంలోనే కూల్చివేత చర్యలు చేపట్టారు.. అయితే కూల్చిన కొద్ది రోజుల్లోనే అదే ప్రదేశంలో, అదే పద్ధతిలో నిర్మాణ పనులు మళ్లీ మొదలవడం అధికారుల పర్యవేక్షణపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తోంది. కంటికి కనిపిస్తున్నా కనిపించనట్టు వ్యవహరిస్తున్న అధికారుల తీరు స్థానికుల్లో ఆగ్రహావేశాలకు కారణమవుతోంది..

5 అంతస్తులకు అనుమతులు ఎవరిచ్చారు?..

ఈ వివాదంలో ఇప్పుడు మరో కీలక ప్రశ్న తెరపైకి వచ్చింది, ఏకంగా 5 అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎవరిచ్చారు? ఇంద్రేశం మున్సిపాలిటీ అధికారులే ఈ స్థాయి అనుమతులు మంజూరు చేశారా? టౌన్ ప్లానింగ్ నిబంధనల ప్రకారం ఎత్తైన నిర్మాణాలకు పై స్థాయి అధికారుల నుంచి అనుమతులు వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో స్థానిక మున్సిపాలిటీ అధికారులు నివేదిక ఇస్తేనే ఆ అనుమతులు మంజూరయ్యే అవకాశం ఉంటుందన్నది తెలుస్తుంది. మరి స్థానిక అధికారుల నివేదిక లేకుండా ఈ స్థాయి అనుమతులు వచ్చే అవకాశమే లేదు కదా? అలాంటప్పుడు సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం జరుగుతున్న విషయం క్షేత్రస్థాయి అధికా రులకు తెలియదా? నివేదిక ఇచ్చేటప్పుడు ఏం పరిశీలించారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి..



ప్రజా కలం
RNI NO.TELTEL/2010/33275
PRAJA KALAM Telugu Daily
10 Sep 2026 - Page 12

రోడ్డు చిన్నది.. భవనం పెద్దది!

- 20 అడుగుల రోడ్డుపై ఆకాశహర్మ్యాలు!
- టౌన్ ప్లానింగ్‌లో నిబంధనలు నిద్రలోనా?..
- నిర్మాణాల సెట్‌బ్యాక్‌లకు చోటేదీ?
- ఇంద్రేశం మున్సిపాలిటీ భవన అనుమతులపై అనేక అనుమానాలు!..
- ప్రమాదం వస్తే బాధ్యత ఎవరిది?..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి)

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణాలపై నిబంధనలు అమలవుతున్నాయా? లేక కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగం, అధికారులు, నిర్మాణాలకు సంబంధించిన నిబంధనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారి వెడల్పుతో పోలిస్తే భారీ భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా 20 అడుగుల రోడ్డుకు ఐదు అంతస్తుల వరకు భవన నిర్మాణాలకు అనుమతులు ఎలా లభిస్తున్నాయి? అనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా మారింది. భవన నిర్మాణాలకు తప్పనిసరిగా పాటించాల్సిన సెట్‌బ్యాక్‌లు, రహదారి వెడల్పు, భవన ఎత్తు, పార్కింగ్, అగ్నిమాపక భద్రత తదితర నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్న రహదారులపై భారీ భవనాలకు అనుమతులు ఇస్తే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు, అగ్నిప్రమాదాల సమయంలో ప్రమాదకర పరిస్థితులు ఎదురైనే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

అనుమతుల వెనుక నిబంధనలు ఏమిటి?..

20 అడుగుల రహదారి ఉన్న ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో పట్టణ ప్రణాళిక అధికారులు ఏ నిబంధనలను పరిగణనలోకి తీసుకున్నారు? సంబంధిత నిబంధనల ప్రకారం రహదారి వెడల్పు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ విస్తీర్ణం, భవన ఎత్తు తదితర అంశాలను పరిశీలించారా? అనుమతులు మంజూరు చేసే ముందు క్షేత్రస్థాయి పరిశీలన జరిగిందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే, అనుమతుల కోసం సమర్పించిన నివేదికల్లో రహదారి వెడల్పు ఎంతగా నమోదు చేశారు? భవనానికి ఎన్ని అంతస్తులకు అనుమతి ఇచ్చారు? సెట్‌బ్యాక్‌లు ఎంతగా చూపించారు? క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులతో అవి సరిపోతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు..

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?..

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది. కానీ నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు వట్టించుకోకపోతే, భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నప్పుడు, అదే స్థలంలో మళ్లీ నిర్మాణం ఎలా కొనసాగుతోంది? కూల్చివేత అనంతరం అక్కడి పరిస్థితిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిది? 5 అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎవరిచ్చారు? ఏ ప్రాతిపదికన ఇచ్చారు? క్షేత్రస్థాయి నివేదిక లేకుండా ఇంత పెద్ద అనుమతి సాధ్యమేనా? నివేదిక ఇచ్చిన అధికారులెవరు?

అనుమతులు ఉన్నా.. సెట్‌బ్యాక్ ఉల్లంఘన ఎలా సాధ్యమైంది? మరి తప్పెవరిది?..

అనుమానాలకు మరింత బలం చేకూరుస్తున్న అధికారుల మౌనం..

పత్రికా కథనాల ద్వారా అక్రమ నిర్మాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న సమయంలో అధికారులు స్పష్టమైన వివరాలు వెల్లడించాల్సింది పోయి నాకు తెలియదు.. సెక్షన్ అధికారిని అడగండి అనే సమాధానంతో సరిపెట్టడం మరింత అనుమానాలకు తావిస్తోంది. కూల్చివేత నిజంగా నిబంధనల ఉల్లంఘనపై జరిగిందా? అయితే తిరిగి నిర్మాణం జరుగుతున్నా ఎందుకు అడ్డుకోవడం లేదు? అనుమతుల మంజూరు దశలో డబ్బులు చేతులు మారాయా? నివేదికలు తారుమారు చేశారా? అనే ప్రశ్నలు ఇప్పుడు జోరుగా చర్చనీయాంశంగా మారాయి. అయితే ఇవి కేవలం స్థానికుల అనుమానాలు మాత్రమేనని, వీటిపై అధికారికంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు..

అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతోంది.!..

అధికారుల ఆదేశాలతో, వారి సమక్షంలోనే కూల్చివేత జరిగితే.. అసలు ఆ నిర్మాణం నిబంధనలకు విరుద్ధమని గుర్తించి కూల్చారా? లేక కూల్చివేత వెనుక మరేదైనా కారణం ఉందా?

అనుమతులు ఉన్నాయి అంటున్నారు.. సెట్‌బ్యాక్ అడిగితే తెలియదు అంటున్నారు!..

విశేషం ఏమిటంటే, అనుమతులు ఉన్నాయి అని స్పష్టంగా చెబుతున్న అధికారులు, సెట్‌బ్యాక్ గురించి అడిగితే మాత్రం తెలియదు అనే సమాధానం ఇస్తుండటం మరింత విస్మయం కలిగిస్తోంది. అనుమతుల విషయంలో స్పష్టతతో మాట్లాడే అధికారులు, నిబంధనల ఉల్లంఘన విషయంలో మాత్రం దాటవేత ధోరణి ప్రదర్శించడం ఏమిటన్నది స్థానికుల్లో తీవ్ర అనుమానాలకు దారితీస్తోంది. ఎంత పొంతనలేని సమాధానానికి అంతులేని అవినీతి జరిగినట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు..

కమిషనర్‌దీ అదే బాట..నాకు తెలియదు..సెక్షన్ అధికారిని అడగండి..

ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా.. ఆయన నుంచి వచ్చిన సమాధానం మరింత విస్మయం కలిగిం చింది. నాకు ఏమీ తెలియదు.. సెక్షన్ అధికారిని అడగండి.. అంతా ఆయనకే తెలుసు అంటూ బాధ్యత నుంచి తప్పించుకునే ధోరణిలో పొంతనలేని సమాధానం ఇవ్వడం గమనార్హం. మున్సిపాలిటీలో జరుగుతున్న నిర్మాణాలపై, అందునా వివాదాస్పదమైన ఒక కూల్చివేత అనంతరం జరుగుతున్న పరిణామాలపై కమిషనర్‌కే సమాచారం లేకపోవడం, సంబంధిత అధికారి వద్దకే వివరాలు

బాలాపూర్ గణేష్ అంటేనే భక్తికి, ఐక్యతకు ప్రతీక

రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలి

బాలాపూర్ గణేష్ ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

మహేశ్వరం, సెప్టెంబరు 15, (ప్రజా కలం) : బాలాపూర్ గణేష్ అంటేనే భక్తికి, ఐక్యతకు ప్రతీక అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్: గణేష్ నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు బాలాపూర్ గ్రామాన్ని సందర్శించారు. హైదరాబాద్ నగరానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ప్రసిద్ధ బాలాపూర్ గణేష్ స్వామివారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలు, పండ్లు సమర్పించి రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు పాల్గొన్నారు. ఉత్సవ సమితి సభ్యులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు మాట్లాడుతూ.. "బాలాపూర్ గణేష్ అంటేనే భక్తికి, ఐక్యతకు ప్రతీక. ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. గణపతి బప్పా ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.బాలాపూర్ గణేష్ మండపం వద్ద భక్తులతో కలిసి కొద్దిసేపు గడిపిన ఎమ్మెల్యే, ఉత్సవ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నందుకు ఉత్సవ సమితి సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రకటన

పేరు మార్పు

మీ అధికారిక రికార్డులలో నా పేరును 'మెదారి జస్టిన్' నుండి 'మెదారి జైయాన్స్ తేజ్' గా మార్చవలసిందిగా వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను.

నేను చట్టబద్ధంగా 'మెదారి జైయాన్స్ తేజ్' అనే పేరును స్వీకరించాను.

దయచేసి సంబంధిత విద్యా మరియు పరిపాలనా రికార్డులన్నింటినీ తదనుగుణంగా నవీకరించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను.

ధన్యవాదాలు

- భవదీయులు

పాత పేరు: మెదారి జస్టిన్

కొత్త పేరు: మెదారి జైయాన్స్ తేజ్

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com